ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 24 సెప్టెంబరు 2024



నేడు మంత్రి నారా లోకేశ్ రాక

- 25న ఐటీ కంపెనీల ప్రతినిధుల సమావేశానికి హాజరు
- అనంతరం రుషికొండ ఐటీ పార్కు సందర్శన



విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం రాత్రి నగరానికి రానున్నారు. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి రాత్రి 8.40 ... మిగతా 6వ పేజీలో

అన్న క్యాంటీన్లకు విశేష ఆదరణ



తాటిచెట్లపాలెం అన్న క్యాంటీన్‌లో రద్దీ

నగరంలో 25 చోట్ల ప్రారంభం

- ఒక్కోచోట సగటున 950 మంది భోజనం
- భోజనం వేళకు కిటకిటలాడుతున్న కేంద్రాలు
- ఎంవీపీ రైతుబజార్ క్యాంటీన్‌కు అత్యధిక తాకిడి
- నమ్మిదొడ్డి క్యాంటీన్‌కు అతి తక్కువ...

అన్న క్యాంటీన్ల వివరాలు	
జీవీఎంసీ పరిధిలో క్యాంటీన్లు	25
ప్రతి రోజూ అల్పాహారం తీసుకుంటున్నవారు	23,750
మధ్యాహ్న భోజనం చేస్తున్నవారు	23,750
రాత్రి భోజనం చేస్తున్నవారు	23,750

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నిరాశ్రయులు, నిరుపేదలకు మూడు పూటలా నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'అన్న క్యాంటీన్ల'కు విశేష ఆదరణ లభిస్తోంది. ఈనెల 19 నుంచి నగరంలో మూడు దశల్లో మొత్తం 25 అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. వీటిలో ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందుబాటులో ఉంటుంది. నిరుపేదలు, ఆపన్నులు వెళ్లి నామమాత్రపు ఖర్చుతో సంతృప్తిగా భోజనం చేస్తున్నారు.

తొలిసారిగా 2018లో టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. నగరంలో 25చోట్ల క్యాంటీన్‌లకు భవనాలను నిర్మించి, రూ.5కు ఉదయం టిఫిన్/మధ్యాహ్నం/రాత్రి భోజనం అందించేది. దీనివల్ల నగరంలో కూలీలు, నిరుపేదలు, ఎలాంటి ఆధారం లేని వారికి నాణ్యమైన ఆహారం లభించేంది. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనం సమయాల్లో అన్న క్యాంటీన్ల పరిసరాలన్నీ జనంతో కిటకిటలాడేవి.

కక్షతో మూసేసిన వైసీపీ

ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ... మిగతా 6వ పేజీలో

తహసీల్దార్ల బదిలీల్లో సిఫారసులకే పెద్దపీట!

- ఏజెన్సీలో పోస్టింగ్స్‌కు సంబంధించి నిబంధనలు పట్టించుకోలేదని విమర్శలు
- డీటీల బదిలీల్లోనూ అదే తంతు
- కోర్టుకు వెళ్లేందుకు పలువురి సిద్ధం

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ల బదిలీల్లో ప్రజా ప్రతినిధుల సిఫారసులకే పెద్దపీట వేశారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీలో పోస్టింగ్స్‌కు సంబంధించి నిబంధనలు (50 ఏళ్లు దాటిన వారిని ఏజెన్సీకి బదిలీ చేయకూడదు) పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దారు బదిలీల్లో విశాఖ జిల్లా నుంచి ఒక్కరినే పంపుతామని సంకేతాలు ఇచ్చిన అధికారులు దానినే అమలుచేశారు. అది కూడా ఎన్నికల తరువాత విశాఖ కలెక్టరేట్‌లో పోస్టింగ్ ఇచ్చినా విధుల్లో చేరని శ్యామ్‌కుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు పంపారు. శ్యామ్‌కుమార్ వయస్సు రమారమి 60 సంవత్సరాలు. ఆయన కంటే వయస్సులో చిన్నవారైన అధికారులను విశాఖ జిల్లాలోనే కొనసాగించారు. అలాగే ఏజెన్సీలో పనిచేస్తూ విశాఖ జిల్లాకు ఆప్షన్ పెట్టుకున్న ఏడుగురిలో నలుగురిని విశాఖ, అనకాపల్లి బదిలీ చేసి, మిగిలిన ముగ్గురిని.. తిరుమలరావు (61 సంవత్సరాలు), నాగరాజు (55 ఏళ్లు), చిన్నకృష్ణ (52 ఏళ్లు) అక్కడే ఉంచారు. వీరు ముగ్గురు ఏజెన్సీలో రెండేళ్లకు మించి పనిచేస్తున్నారు. విశాఖ జిల్లాలో జూనియర్లను కొనసాగించారు. వీరిలో కొందరు ఏజెన్సీలో ఒక్కరోజు కూడా పనిచేయలేదు. అయితే సంఘ నేతలని ఒకరిద్దరిని, ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల కారణంగా మరికొందరిని బదిలీల నుంచి మినహాయించారు. రెండు నెలల క్రితం తహసీల్దార్ల పోస్టింగ్స్‌లో ముగ్గురి, నలుగురి విషయంలో వివాదాలు చేలరేగినప్పుడు వారిలో కనీసం ఇద్దరు లేదా ముగ్గురికి స్థానచలనం ఉంటుందని భావించారు. అయితే సిఫారసులు బాగా పనిచేయడంతో వారి జోలికి వెళ్లలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా రెండు నెలల క్రితం బదిలీల్లో ఇద్దరికి తగిన ప్రాధాన్యం ఉన్న మండలాలు దొరకలేదు. వారిరువురూ తమకున్న పలుకుబడిని ఉపయోగించుకుని అనకాపల్లి జిల్లాకు వెళ్లిపోయారు. వీరిరువురూ 50 సంవత్సరాలకంటే తక్కువ వయస్సు ఉన్నవారే. ఇదిలావుండగా బదిలీల్లో అన్యాయం జరిగిందని భావిస్తున్న కొందరు తహసీల్దార్లు కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. కాగా 40 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 55 మంది సీనియర్ అసిస్టెంట్లు, 14మంది జూనియర్ అసిస్టెంట్లను ... మిగతా 6వ పేజీలో

జడ్పీలో బదిలీలు

ఉమ్మడి జిల్లాలో 154 మందికి స్థానచలనం

- జాబితాలో 29 మంది ఎంపీడీవోలు...
- 10 మంది ఎంపీడీవోలు కొనసాగింపు



విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా పరిషత్ పరిధిలో ఎంపీడీవో నుంచి అటెండర్ వరకు మొత్తం 154 మందికి సోమవారం బదిలీ అయ్యింది. ఈ జాబితాలో 29 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో) ఉన్నారు. బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లా నుంచి తొమ్మిది మంది ఇతర జిల్లాలకు వెళ్లగా, ఇతర జిల్లాల నుంచి పది మంది ఎంపీడీవోలు వచ్చారు.

తాజా బదిలీల్లో భాగంగా ఆనందపురం ఎంపీడీవో ఎ.లవరాజును అరకులోయ బదిలీ చేసి, ఆయన స్థానంలో భీమిలి ఎంపీడీవో వి.జానకిని నియమించారు. నాతవరం ఎంపీడీవో ఎస్.హనుమంతురావును భీమిలి బదిలీ చేశారు. అచ్యుతాపురం ఎంపీడీవో వి.విజయలక్ష్మిని బుచ్చెయ్యపేట బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న ఎంపీ సువర్ణరాజును దేవరాపల్లి మార్చారు. ఇప్పటివరకూ దేవరాపల్లిలో పీఆర్ఏఈ ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా చీడికాడ ఎంపీడీవో ఎ.జయప్రకాశరావును పాయకరావుపేట బదిలీ చేసి, ఆయన స్థానంలో పరవాడ ఎంపీడీవో వి.హేమసుందరరావును నియమించారు. చోడవరం నుంచి ఎస్‌డీ శ్యామ్‌సుందర్‌ను పరవాడ బదిలీ చేసి, కొత్తగా వచ్చిన పీవీఎన్‌జే ఆంజనేయులుకు చోడవరం ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. గొలుగొండలో పనిచేస్తున్న ఎస్.డేవిడ్‌రాజును ఎస్.రాయవరం బదిలీ చేసి, ఆయన స్థానంలో కొయ్యూరు ఎంపీడీవో ఎ.మేరీ రోజ్‌ను నియమించారు. ఆమె స్థానంలో సబ్బవరంలో పనిచేస్తున్న బి.రమేష్‌నాయుడును నియమించి కొత్తగా వచ్చిన పద్మజకు సబ్బవరం ఎంపీడీవోగా పోసింగ్ ఇచ్చారు. నక్కపల్లి ఎంపీడీవో మరో జిల్లాకు ... మిగతా 6వ పేజీలో

దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా అన్నపూర్ణ

- విజయనగరం ఏసీగా శిరీష బదిలీ
- కనకమహాలక్ష్మి ఈఓగా సుజాత



టి.అన్నపూర్ణ

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ బదిలీల్లో భాగంగా అనకాపల్లి నూకాంబికా అమ్మవారి దేవస్థానం ఈఓ టి.అన్నపూర్ణను విశాఖపట్నం అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న కె.శిరీషను విజయనగరం జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. అయితే సంపత్ వినాయక ఆలయం ఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న శిరీషకు అక్కడ కొనసాగేందుకు అవకాశం కల్పించారు. ఇదిలావుండగా విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్.సుజాతకు పదోన్నతి కల్పించి అదే పోస్టులో కొనసాగాలని ఆదేశించారు. దీంతో పాటు కనకమహాలక్ష్మి దేవస్థానం ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ ఆలయంలో ఈఓగా ఉన్న డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాసరెడ్డిని పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓగా బదిలీ చేశారు.

వీఎంఆర్‌డీఏ సీయూపీగా శిల్ప

వీకే పీసీపీఐఆర్ జేడీగా సంజయ్ రత్నకుమార్



శిల్ప

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో చీఫ్ అర్బన్ ప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న సంజయ్ రత్నకుమార్‌ను విశాఖపట్నం కాకినాడ-పెట్రో కెమికల్, పెట్రో ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (వీకే-పీసీపీఐఆర్) జాయింట్ డైరెక్టర్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న శిల్పను వీఎంఆర్‌డీఏ సీయూపీగా వేశారు. ఆమె గతంలో వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ విభాగంలో పీఓగా పనిచేశారు. ఇప్పుడు అదే విభాగం అధిపతిగా వచ్చారు. వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌కు మార్పులు చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఆమెకు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారని సమాచారం. సీయూపీగా సంజయ్ రత్నకుమార్ ఏడాది క్రితం బాధ్యతలు చేపట్టారు.

ఈపీడీసీఎల్‌లో కొనసాగుతున్న కసరత్తు

- ఇంకా పూర్తికాని ఎస్ఈలు, డీఈలు, ఏఈల బదిలీల ప్రక్రియ
- కొత్త సర్కిళ్లతో సర్దుబాటుకు అధికారుల పాట్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో బదిలీల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. గడువు ముగిసినా అధికారులు కసరత్తు చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం బదిలీలకు అవకాశం ఇవ్వగానే ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కానీ 22వ తేదీలోగా బదిలీలు చేయలేకపోయారు. సిబ్బంది కొరత అధికంగా ఉండడం, ప్రభుత్వం కొత్త జిల్లాల ప్రాతిపదికన బదిలీలు చేయాలని సూచించడంతో ఉన్నవారిని సర్దుబాటు చేయడానికి కుస్తీ పడుతున్నారు.

ఉత్తరాంధ్ర వరకు తీసుకుంటే కొత్తగా అనకాపల్లి, అల్లూరి మన్యం, పార్వతీపురం మన్యం జిల్లాలు ఏర్పడ్డాయి. ఆయా జిల్లాల్లో అప్పట్లో అన్ని శాఖలకు సిబ్బందిని కేటాయించి, కార్యాలయాలు ఏర్పాటుచేసినా ఈపీడీసీఎల్‌లో ఆ ప్రక్రియ చేపట్టలేదు. ఉమ్మడి జిల్లాల అధికారులే విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లా కేంద్రాల్లో ఉండి పర్యవేక్షించారు. ఇప్పుడు తప్పనిసరిగా ప్రతి కొత్త జిల్లాలో ఒక సర్కిల్ కార్యాలయం ఏర్పాటుచేసి ఎస్ఈ, డీఈ, ఇద్దరు ఏఈలు, ఇద్దరు జూనియర్ ఇంజనీర్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దర సీనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌ను నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ ప్రకారం సంస్థ పరిధిలోని అన్ని కొత్త జిల్లాలకు కొత్తగా పది మంది అధికారులను సర్దుబాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే సిబ్బంది కొరత వల్ల అధికారులు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఇది కూడా తోడు కావడంతో ఎక్కడకు ఎవరిని పంపాలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నారు. ఇదిలావుండగా 76 మంది ... మిగతా 6వ పేజీలో

అస్త్రశస్త్రాలతో ఇరు పక్షాలు రెడీ

నేడే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం



- కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇదే తొలిసారి
- వైసీపీ హయాంలో చేసిన తీర్మానాలపై చర్చకు కూటమి పట్టుపట్టే అవకాశం
- మెకానికల్, నీటి సరఫరా, యూజీడీ విభాగాల్లో అవినీతిపై దృష్టి
- కూటమి దాడిని ఎదుర్కొనడంపై వైసీపీ కార్పొరేటర్ల సమాలోచన
- మేయర్ ఆధ్వర్యంలో షాడో సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ సర్వసభ్య సమావేశం మంగళవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరగనుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కావడంతో సభ్యులందరిలోనూ ఒకింత ఆసక్తి నెలకొంది. కౌన్సిల్ సమావేశం కోసం అధికారులు 75 అంశాలతో రెండు ఎజెండాలను తయారుచేసి ఇప్పటికే సభ్యులకు అందజేశారు.

సాధారణ ఎన్నికల తర్వాత జీవీఎంసీ కౌన్సిల్‌లో పార్టీల బలాబలాలు మారిపోయాయి. ఎన్నికల ముందు వరకూ కౌన్సిల్‌లో వైసీపీకి మెజారిటీ ఉండేది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ కార్పొరేటర్లు పలువురు టీడీపీ, జనసేనల్లో చేరారు. ఈ నేపథ్యంలో గత నెలలో జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందారు. ఈ క్రమంలో మంగళవారం నాటి కౌన్సిల్ సమావేశంలో వైసీపీ హయాంలో జీవీఎంసీలో జరిగిన అవినీతిపై ప్రశ్నించాలని కూటమి కార్పొరేటర్లు నిర్ణయించారు. మెకానికల్ విభాగంలో ఎన్ని వాహనాలు ఉన్నాయి?, జోన్‌ల వారీగా ఎన్ని వాహనాలు ఉన్నాయి?, ప్రధాన కార్యాలయంలో ఎన్ని వాహనాలు ఉన్నాయనే వివరాలు అడిగితే అధికారులు ఇంతవరకూ ఇవ్వకపోవడంతో ఆ విభాగం అధికారులను నిలదీయాలని కూటమి కార్పొరేటర్లు భావిస్తున్నారు. అలాగే నగరంలో రోడ్లను శుభ్రపరిచే వాహనాలు ఎన్ని ఉన్నాయి?, వాహనాల రిపేర్లు, నీటి సరఫరా విభాగంలో లీకేజీలు, నిర్వహణకు పిలుస్తున్న టెండర్లు, యూజీడీ నిర్వహణకు పిలిచిన టెండర్లతోపాటు హార్టికల్చర్ విభాగంలో వెలుగులోకి వచ్చిన అవినీతిపై కూడా కౌన్సిల్‌లో చర్చకు పట్టుబట్టాలని ఇటీవల జరిగిన కూటమి కార్పొరేటర్ల షాడో సమావేశంలో తీర్మానం చేసినట్టు తెలిసింది. అంతేకాకుండా వైసీపీ హయాంలో మధురవాడ ఆరో వార్డులోని ఎస్ఆర్ఎం లేఅవుట్‌లోని బటర్‌ఫ్లై పార్కు స్థలం బదలాయింపునకు కౌన్సిల్‌లో వైసీపీ ఏకపక్ష తీర్మానం చేయడం, వైసీపీ నేతల ఆస్తులకు రోడ్ల నిర్మాణం, టీడీఆర్‌ల జారీకి సంబంధించిన ... మిగతా 6వ పేజీలో

హార్టీకల్చర్‌లో అంతా మాయే

- కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కు
- నామినేషన్ పద్ధతిపై కట్టబెడుతున్నవైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బట్టబయలు చేయడంతో అధికారుల్లో కలవరం
- హడావిడిగా 15 పనులకు షార్ట్ టెండర్
- బిడ్ దాఖలుకు మూడు రోజులే అవకాశం
- అస్మదీయులైన కాంట్రాక్టర్లకే పనులు దక్కేలా వ్యూహం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ హార్టీకల్చర్ విభాగంలో తవ్వేకొద్దీ అవినీతి బయటపడుతోంది. నగర సుందరీకరణ, పచ్చదనం పరిరక్షణ పేరుతో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై నిధులను స్వాహా చేస్తున్న వైనంపై 'జీవీఎంసీ హార్టీకల్చర్ విభాగంలో అవినీతి మొక్కలు' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం నగరంలో చర్చనీయాంశమైంది. గత ఆరు నెలలుగా టెండర్లు పిలవకుండా నామినేషన్ పద్ధతిపై అస్మదీయులైన కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టిన అధికారులు ఇప్పుడు కొత్త డ్రామా మొదలెట్టారు. టెండర్లు పిలిచామని చెప్పుకునేందుకు షార్ట్ టెండర్ పేరుతో మూడు రోజుల్లో బిడ్లు దాఖలు చేయాలంటూ 15 పనులకు టెండరు ఆహ్వానించడంపై మరిన్ని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలో కొన్ని పార్కుల నిర్వహణతోపాటు జాతీయ రహదారి సెంటర్ మీడియన్, ఇరువైపులా ఉన్న గ్రీన్‌బెల్ట్‌తోపాటు నగరంలోని ప్రధాన రహదారుల సెంటర్ మీడియన్లు, ముఖ్యమైన కూడళ్లలో పచ్చదనం పెంపొందించడం, మొక్కలను నాటడం, వాటిని పరిరక్షించడం, నీరుపెట్టడం, కూడళ్లలోని మొక్కలను ఆకర్షణీయంగా కనిపించేలా కటింగ్ (ప్రూనింగ్) చేయడం వంటి పనులను జీవీఎంసీ హార్టీకల్చర్ విభాగం ... మిగతా 6వ పేజీలో

గాజువాక మునిసిపల్ మాజీ చైర్మన్ వీవీఎన్ఎం రాజా హఠాన్మరణం



కూర్మన్నపాలెం, సెప్టెంబరు 23: గాజువాక మునిసిపల్ మాజీ చైర్మన్ వీవీఎన్ఎం రాజా (57) సోమవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన యువజన కాంగ్రెస్ నాయకుడిగా, కార్పొరేటర్‌గా, గాజువాక మునిసిపాలిటీగా ఉన్నప్పుడు వైస్ చైర్మన్‌గా, చైర్మన్‌గా పనిచేశారు. 2004కు ముందు గాజువాక మునిసిపల్ చైర్మన్‌గా ఉన్న తిప్పల గురుమూర్తిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో, ఆ స్థానంలో రాజా ఎన్నికై ఏడాదిపాటు పనిచేశారు. అనంతరం గాజువాక మునిసిపాలిటీ జీవీఎంసీలో విలీనం అయ్యింది. రాజా కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి మారిన రాజా 2014 అసెంబ్లీ ఎన్నికల సమయంలో వైసీపీలో చేరారు. గుండెకు సంబంధించిన సమస్య తలెత్తడంతో కొన్నేళ్ల క్రితం బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. సోమవారం గుండెపోటు రావటంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన కూర్మన్నపాలెంలోని ఏప్లస్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రాజా మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన భౌతికకాయాన్ని శివాజీనగర్‌లోని స్వగృహానికి తరలించారు. రాజాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బదిలీ అయినా కదలని సీఐలు!

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో కొందరు అధికారులకు 15 రోజుల కిందట బదిలీ జరిగినా..ఇప్పటికీ రిలీవ్ కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ సీఐ చక్రధరరావుకు రేంజ్‌కు బదిలీ అయింది. ఆయన స్థానంలో ఏసీబీలో పనిచేస్తున్న కిషోర్‌కుమార్‌ను నియమించారు. అయితే చక్రధరరావు ఇంకా కొనసాగుతుండడం విశేషం. అలాగే ఫోర్త్ టౌన్ సీఐ కె.విజయ్‌కుమార్‌కు రేంజ్‌కు బదిలీ అయింది. ఆయన స్థానంలో వెంకటరావును నియమించారు. అయినా ఇప్పటికీ విజయ్‌కుమార్ కొనసాగుతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మరోవైపు పీఎంపాలెం ఎస్ఐ సురేష్‌ను అక్కడినుంచి సీపీ బదిలీ చేశారు. ఆయన కూడా ఇంకా అక్కడే కొనసాగుతున్నారు. ఇదిలా వుంటే హార్బర్ ఏసీపీ మోసేజ్‌పాల్‌కు నెలరోజులు కిందటే బదిలీ జరిగింది. కానీ ఇప్పటికీ ఆయన తన బాధ్యతల నుంచి రిలీవ్ కాకపోవడం, సీపీ కూడా రిలీవ్ కావాలని ఆదేశించకపోవడం విశేషం.

కేజీహెచ్‌లో మరిన్ని వసతుల కల్పన: వంశీకృష్ణ



కార్డియాలజీ విభాగంలో పరికరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మహారాణిపేట, సెప్టెంబరు 23: కేజీహెచ్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కేజీహెచ్‌లో పర్యటించారు . రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వివిధ విభాగాల వార్డులలో ప ర్యటించారు. వైద్య సిబ్బంది పనితీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో ఆస్ప త్రి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఆధునాతన సదుపాయాలతో మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ రహమాన్ ఆధ్వర్యంలో భారతిగిరి సొంత నిధులతో సమకూర్చిన కార్డియాలజీ విభాగంలో ఈసీజీ మానిటర్లు, బీబీ ఆపరేటర్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అధికారులు పాల్గొన్నారు.

పవన్ దీక్షకు మద్దతుగా జన సైనికుల పూజలు



గోవింద నామ స్మరణలో ఉషాకిరణ్, నాయకులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 23: తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలతో తయారు చేసిన నెయ్యి వాడడం దుర్మార్గమని ఉత్తర నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. గత వైసీపీ పాలకులు తిరుపతి లడ్డూ తయారీలో చేసిన అపరాధాలను క్షమించాలని ప్రార్థిస్తూ జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని వినాయక మండపంలోని గణనాథుడికి పూజలు చేశారు. సాముహిక గోవింద నామ స్మరణ చేశారు. ఈ కార్య క్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, నాయకులు శ్రీధర్, దివాకర్, అప్పారావు, నాగమణి, బండి కన్నా, వాసు, త్రినాథ్ పాల్గొన్నారు.

కళల ద్వారా మానసిక ప్రశాంతత



గాయనీగాయకులు సన్మానిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 23: కళల ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు గాయకులు అన్నారు. సంగీత కళా రంగానికి విశేష సేవలందిస్తున్న గాయక దంపతులు విశ్వప్రసాద్, కోమలిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. విజయ విశాఖ మ్యూజికల్స్ ఈవెంట్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా గాయక దంపతులు విశ్వప్రసాద్, కోమలి పాడిన గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. విజయ సారథ్యం వహించిన కార్యక్రమంలో రెడ్డి ప్రభ, అలేఖ్య, తులసి, శోభ, సత్యవతి, పింకీ, ఎస్.ఎస్. రావు, వెంకట్, హిమ, కైలాష్, శ్రీనివాస్, మధు గీతాలు ఆలపించి అలరించారు.


విద్యార్థినులు సమాజాన్ని చైతన్యవంతం చేయాలి



ర్యాలీ చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 23: విద్యార్థినులు సమాజ చైతన్యం చేసేందుకు కృషి చేయాలని ఆంధ్రయూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ హరినాథ్, పైడా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సరోజ్ పేర్కొన్నారు. సోమవారం డాబాగార్డెన్స్ పాత జైల్‌రోడ్డులోని పైడా మహిళా కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురు విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. ఆంధ్ర యూనివర్సిటీలో విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హరినాథ్, సరోజ్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజాన్ని చైతన్యవంతం చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రామశేషు, పైడా డిగ్రీ కళాశాల ప్రోగ్రామ్ ఆఫీసర్ మౌనిక, అగర్వాల్ ఐ ఆస్పత్రి వైద్య బృందం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రమిస్తున్న కార్పొరేటర్ అప్పారావు

కంచరపాలెం, సెప్టెంబరు 23: జీవీఎంసీ 48వార్డు పరిధి కొండవాలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం ఎమ్మెల్యేను తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి ప్రతమిచ్చారు. వార్డులో కనీస వసతులైన రోడ్లు, కాలువలు, రిటర్నింగ్ వాల్స్ నిర్మాణానికి చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే, ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన రోడ్లు, కాలువలకు మరమ్మతులు చేపట్టాలని అన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అభివృద్ధి పనులను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, తదితరులు

మాజీ సీఎం జగన్ రూ. వేల కోట్లు దోచేశారు

» ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 23 : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రూ.30 వేల కోట్లు దోపిడీ చేశారని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు. గ్రేటర్ 42, 43 వార్డులకు సంబంధించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎనభై అడుగుల రోడ్డులో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్మోహన్‌రెడ్డి వేలాది కోట్ల రూపాయలను దోచేశారన్నారు. అంతేకాకుండా రాష్ట్రం రూ. 135 వేల కోట్లు అప్పులు చేశారన్నారు. అయినా, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. విశాఖలో గంజాయిని అరికట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, నాయకులు అకిరెడ్డి జగదీష్, జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, 43వ కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, టీడీపీ, బీజేపీ, జనసేన వార్డు అధ్యక్షులు కన్నం వెంకటరమణారావు,బొడ్డేటి మోహనరావు, గురుగోవింద్ సింగ్, ము తమ్మన నాగమణి, ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నాయకులు ముప్పాళ్ళ శ్రీకృష్ణ, కొయిలాడ వెంకటేష్, లొడగల కృష్ణ, తోట శ్రీదేవి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన: వంశీకృష్ణ

పూర్ణామార్కెట్: పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రేటర్ 35 వార్డులో జరిగిన ఇది మీ ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వంద రోజుల పాలనలో పేదలకు పెన్షన్ల పెంపు, పేదల కోసం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డులోని మహిళలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, పూర్ణామార్కెట్ వరసిద్ధి వినాయక వర్తక సంఘం కార్యదర్శి గంగాడ గోవింద్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేష్ ఆధ్వర్యంలో 44వ వార్డులోని 238, 239 సచివాలయాల పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి ప్రజలకు వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లను పంపిణీ చేస్తున్నారని, అన్న క్యాంటీన్లు ప్రారంభించి రూ.5కే పేదల కడుపునింపుతున్నారన్నారు. సచివాలయ అడ్మిన్లు శివకృష్ణ, రాజేష్, కూటమి నాయకులు కాళ్ళ గౌరీశంకర్‌నాయుడు, రఘునాథ్, ఎం.మోహన్‌రావు, పందిరిపల్లి శ్రీను, అమ్మారావు, రెడ్డి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం: రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటికి మంచి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం జీవీఎంసీ 34 వార్డు ఆచ్చయ్యమ్మపేటలో నిర్వహించిన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రజలంతా స్వర్ణాంధ్ర -2047 సర్వేలో పాల్గొని రాష్ట్ర అభివృద్ధికి సలహాలు సూచనలు అందించాలని కోరారు.అనంతరం వందరోజుల పాలనపై ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్,జోన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు,ఏపీడీ పద్మావతి, టీడీపీ నాయకుడు వాసుపల్లి రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 55వార్డు పరిధి గంగన్న నగర్, జోగారావు నగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని వార్డు టీడీపీ నాయకురాలు ఈతలపాక సుజాత సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా సుజాత ఇంటింటికీ వెళ్లి 100 రోజుల పూర్తిచేసుకున్న నేపథ్యంలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు.కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు గంట్యాడ వీరుబాబు,ఈశ్వరరావు,సచివాలయ సిబ్బంది చైతన్యశోభన్ పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర- 2047'పై అవగాహన



పోస్టరు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

మహారాణిపేట, సెప్టెంబరు 23: గ్రామ సభలు, ఇతర వేదికల్లో సర్ణాంధ్ర-2047పై అవగాహన కల్పించనున్నట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. దీనిని సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం జేసీ, ఆర్‌డీవో, డీఆర్‌వోలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పోస్టర్‌ను ప్రతీ ప్రభుత్వ కార్యాలయం వద్ద అతికించాలని సూచించారు. స్వర్ణాం ధ్రపై తమ అభిప్రాయాలు, సలహాలను ప్రభుత్వానికి అందించాలని ప్రజలకు సూచించారు. జిల్లా నుంచి 50 వేల ఫీడ్ బ్యాక్‌లను స్వీకరించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులంతా భాగస్వాములైన తమ అభిప్రాయాలు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్యశిబిరం

అల్లిపురం,సెప్టెంబరు 23: పరిసరాలను పరిశుభ్రతకు అనునిత్యం పాటుపడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్న పారిశుధ్య కార్మికులు నిజమైన హీరోలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జీవీఎంసీ 34 వార్డు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్మికుల కోసం సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. జీవీఎంసీ కమిషనర్ పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడారు. వైద్యులు పారిశుధ్యకార్మికులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జోన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీకి వినతి

మహారాణిపేట, సెప్టెంబరు 23: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతానికి పైగా ఫీజు రాయితీ కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న అక్రిడేషన్లు జారీ చేయాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. సోమవారం కలెక్టర్‌ను జర్నలిస్టు సంఘాల ప్రతినిధి పి. సత్యనారాయణ ఆధ్వర్యంలో కలసి వినతి పత్రమిచ్చారు. జర్నలిస్టు సంఘాల హెల్త్ స్కీమ్ కింద ప్రీమియం చెల్లింపునకు సీఎస్ఆర్ నిధులు కేటాయించినట్టు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు ఆర్. రామచంద్రరావు కె. చంద్ర మోహన్, కె.ఎం. కీర్తన్, ఎ. శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

జ్ఞానాపురం,సెప్టెంబరు 23: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కారమ య్యేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము ఆదేశించారు. సోమవారం ఉదయం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజా వేదిక నిర్వహించారు. మొత్తం 7 అర్జీలను స్వీకరించారు.వీటిలో పట్టణప్రణాళికా విభాగానికి 4, రెవెన్యూకు 2, పబ్లిక్ వర్క్స్ విభాగానికి ఒకటి వచ్చినట్టు ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ టి.ఎస్ఎన్.రాజు, ఇంజనీరింగ్ ఈఈ తారా ప్రసన్న, టీపీఓ విజయ్‌కుమార్, ఆర్‌లు బాబురావు, రాజ్యలక్ష్మి, ఏపీడీలు చిరంజీవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తమ వారినే తీసుకోవాలని రగడ

» అన్నక్యాంటీన్ వద్ద టీడీపీ 35వ వార్డు అధ్యక్షుడు హల్‌చల్



ఇందిర మున్సిపల్ స్టేడియం వద్ద అన్నక్యాంటీన్‌లో రామిరెడ్డి వాగ్వాదం

జగదాంబ కూడలి, సెప్టెంబరు 23: గ్రేటర్ 35 వార్డు ఇందిర గాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న అన్నక్యాంటీన్‌లో తమవారినే నియమించాలని కోరుతూ కొంత మంది టీడీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. సోమవారం ఆ పార్టీ వార్డు అధ్యక్షుడు బొచ్చారామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ మేరకు హల్‌చల్ చేశారు. వివరాలివి.. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లను పునరుద్ధరించిన విషయం తెలిసిందే. పూర్ణామార్కెట్ పరిధిలోని ఇందిరా మున్సిపల్ స్టేడియం దరిలోని అన్న క్యాంటీన్ ఇటీవల తెరిచారు. వీటి నిర్వహణ బాధ్యతలను హరేకృష్ణ మూమెంట్‌కు అప్పగించారు. క్యాంటీన్లలో అవసరమైన సిబ్బందిని సైతం ఆ సంస్థ నియమించింది. అయితే, వార్డు అధ్యక్షుడు రామిరెడ్డి, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, జనసేన నాయకులు తాము సూచించిన వ్యక్తులకే ఈ క్యాంటీన్లలో ఉద్యోగులుగా కోరారు. ఈ మేరకు హరేకృష్ణా మూమెంట్ సంస్థ ఈ క్యాంటీన్ లోపల పనిచేసిన వారందరనీ టీడీపీ వార్డు అధ్యక్షుడు, జనసేన నాయకులు సూచించిన వ్యక్తులనే నియమించింది. ప్రస్తుతం క్యాషియర్‌గా పనిచేస్తున్న సంధ్యను సైతం విధుల నుంచి తొలగించాలంటూ టీడీపీ వార్డు అధ్యక్షుడు రామిరెడ్డి క్యాంటీన్ వద్దకు వెళ్లి సోమవారం ఉదయం రగడకు దిగారు. క్యాషియర్ సీటులో ఉన్న సంధ్యను బలవంతగా లేపి, తమకు అనుకూలంగా ఉన్న మరో యువతిని కూర్చోపెట్టారు. అన్నక్యాంటీన్ నిర్వాహకులు చేసేది లేక ప్రస్తుతం పనిచేస్తున్న క్యాషియర్ సంధ్యను విధుల నుంచి తొలగించడం గమనార్హం. తనపైనే కుటుంబ పోషణ భారం ఉందని, ఇలా అర్థాంతరంగా తొలగించడంతో వీధిన పడతామని ఆమె ఆవేదన వ్యక్తంచేస్తోంది.

తొలుతనుంచి కోరుతున్నాం: -వార్డు అధ్యక్షుడు రామిరెడ్డి

ఈ వ్యవహారంపై టీడీపీ అధ్యక్షుడు బి.రామిరెడ్డి 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, అన్న క్యాంటీన్‌లో తమ వారినే నియమించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణకు కోరామన్నారు. అలా కాకుండా వేరే వారికి అవకాశం కల్పిస్తారని హరేకృష్ణ మూమెంట్ నిర్వాహకులను ప్రశ్నించారు.

విద్యుత్ అండర్‌గ్రౌండ్ సిస్టం పూర్తి చేయాలి

» ఎంపీ శ్రీభరత్



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 23: త్వరితగతిన అండర్‌గ్రౌండ్ సిస్టమ్‌ను సిటీ మొత్తం పూర్తి చేయాలని ఎంపీ శ్రీభరత్ సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ ఈస్టర్ పవర్ డిస్ట్రిబ్యూషన్ అధికారులతో ఎంపీ శ్రీభరత్ సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికారులు సమన్వయంతో పనిచేయడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని కొనియాడారు. కేంద్రం నుంచి వస్తున్నా రీ వాంప్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్, ప్రధాన మంత్రి కుసుమ్ , సూర్య ఘర్ యోజన తదితర పథకాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో సోలార్, ఇతర పునరుత్పాదకాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అర్హులందరికీ సబ్సిడీలు అందించేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు.

గ్రామీణ క్రీడాకారుడికి ఆర్థిక సాయం

సీతమ్మధార, సెప్టెంబరు 23: తైక్వాండోలో చీఫ్ కోచ్ డాక్టర్ పాండ్రంగి రుక్మాకర్ రావు వద్ద శిక్షణ పొంది పలు పతకాలను సాధించిన కొత్తవలస మండలం కంటకాపల్లికి చెందిన క్రీడాకారుడు ములవర్తి ప్రకాశరావుకి ఎలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 105 తరపున ఎలయన్స్ గవర్నర్ దండెం పోలారావు సమక్షంలో సంస్థ పూర్వాధ్యక్షుడు బి.తిరుపతిరాజు చేతుల మీదుగా రూ.60వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్ అపార్టుమెంట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తిరుపతిరాజు మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన మలేషియాలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న తైక్వాండో పోటీల్లో పాల్గొనేందుకు ప్రకాశరావు వెళ్తున్న నేపథ్యంలో ఆయనకు ఆర్థిక సాయం చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోచ్ రుక్మాకరరావు, ఎలయన్స్ క్లబ్ ప్రతినిధులు మట్టపల్లి విశ్వేశ్వరరావు, డి.ఆర్.కె. రావు, కె.చంద్రశేఖర్‌రావు, ఎ.ఉషారాణి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్స్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలో అయోమయం

మల్కాపురం, సెప్టెంబరు 23: విశాఖపట్నం ఆయిల్ ట్యాంకర్స్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికపై ఉత్కంఠత నెలకొలంది. అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి చేపట్టిన ఓట్ల లెక్కింపులో తలెత్తిన తేడాతో సమస్య నెలకొంది. ఈ ఎన్నికలో ఓటింగ్ చేసే వారి సంఖ్య 204 కాగా, అధ్యక్ష పదవి కోసం ఇద్దరు అభ్యర్థులు పోటీపడ్డారు. వీరిలో ఒక్కరికి 220, మరొక్కరికి 221 ఓట్లు నమోదయ్యాయి. అయితే, ఓట్లు వేసిన వారు 204 మంది అయితే, ఒక్కరికి 220, ప్రత్యర్థికి 221 ఓట్లు లెక్కింపులో తేలడంతో ఎన్నికల నిర్వహణ అధికారులు అయోమయానికి లోనయ్యారు. దీంతో ఈ ఫలితంపై ఎటువంటి ప్రకటన చేయలేదు. ఇక, అదే ప్రధాన కార్యదర్శి స్థానానికి పోటీకి వస్తే.. ఒకరికి 112 ఓట్లు..మరొక్కరికి 99 ఓట్లు పోలయ్యాయి. ఈ స్థానానికి విజేతను ప్రకటించడానికి వీలున్నా, దీనిపైనా ప్రకటన చేయలేదు. బుధవారం ఈ విషయమై స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు సమావేశమై తీర్పు ఇవ్వనున్నారు. అయితే, ముందస్తుగా స్పష్టమైన జాబితా రూపొందించకుండా ఎన్నిక నిర్వహించడంతో సమస్య తలెత్తినట్టు సభ్యులు చెబుతున్నారు.

29న పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 23: పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి ఆరవ రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ జరగనుంది. రైల్వే స్విమ్మింగ్ పూల్‌లో జరిగే ఈ టోర్నీ పోస్టర్ కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన స్విమ్మర్లు జాతీయ స్థాయి టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి రామస్వామి వివరించారు. ఇక రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొనేవారు ఈనెల 25వ లోపు ఫోన్: 7013569514, 9390131777 నందు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్, పారా స్పోర్ట్సు అసోసియేషన్ ప్రతినిధులు శీతల మదన్, జ్యోతి, శివ గంగ దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి నారా లోకేశ్ రాక

... 5వ పేజీ తరువాయి

గంటలకు బయలుదేరి 9.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి రాత్రి 10.10 గంటలకు సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వెనుక ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేస్తారు. ఈనెల 25వ తేదీన దేశంలో ప్రముఖ ఐటీ కంపెనీల ప్రతినిధులతో నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించే సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. అనంతరం రుషికొండ ఐటీ పార్కును సందర్శించి అక్కడ ఉద్యోగులు, నిపుణులతో భేటీ అవుతారు. బుధవారం రాత్రి తిరిగి విజయవాడ వెళతారు.

అన్న క్యాంటీన్‌లకు విశేష ఆదరణ

... 5వ పేజీ తరువాయి

మూసివేయడంతో పేదలకు ఇక్కట్లు మొదలయ్యాయి. కొంతమంది అర్ధాకలితో అలమటించేవారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నక్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. జీవీఎంసీ పరిధిలో 25 చోట్ల అన్నక్యాంటీన్లను పునఃప్రారంభించింది. దీంతో నిరుపేదలు, దినసరికూలీలు, ఎలాంటి ఆధారంలేని వారిముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. విమ్స్ ఆస్పత్రి, ఎంవీపీ రైతుబజార్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ టీబీ ఆస్పత్రి, టర్నర్‌చౌల్ట్రీ, హోల్‌సేల్ ఫ్రూట్‌మార్కెట్, మర్రిపాలెం, శ్రీహరిపురం, ములగాడ, నమ్మిదొడ్డి, చినగంట్యాడ, చిట్టివలస, బాజీజంక్షన్, పెందుర్తి, వేపగుంట, గోపాలపట్నం రైతుబజార్, కేజీహెచ్, ఆరిలోవ, మారికవలస, వాంబేకాలనీ, వైఎస్ఆర్ కాలనీ, ఆటోనగర్, భీమిలి, ఎన్టీఆర్ ఆస్పత్రి, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. వీటిలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను రూ.5 చొప్పున అందజేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో అన్న క్యాంటీన్‌లో ప్రతిరోజూ సగటున 950 మంది ఆహారం తీసుకుంటున్నారు. రుచి, శుచి, నాణ్యతతో ఉన్న ఆహారపదార్థాలను రోజువారీ కూలీలు, ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారులు తృప్తిగా ఆరగిస్తున్నారు. దీంతో క్యాంటీన్లకు ఆదరణ పెరుగుతోంది. కంచరపాలెంలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయపాత్ర సెంట్రల్ కిచెన్‌లో వంటకాలను సిద్ధం చేసి, వాహనాల్లో అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్నారు.

ఉదయం అల్పాహారం కింద ప్రతిరోజూ మూడు ఇడ్లీ, 150 మిల్లీలీటర్ల సాంబార్, 150 గ్రాముల చట్నీ ఇస్తున్నారు. ఒక్కో ఇడ్లీ 45 గ్రాములుంటుంది. సోమవారం, గురువారాల్లో మూడు పూరీ, 100 గ్రాముల కూర అందిస్తారు. మంగళ, శుక్రవారాల్లో 250 గ్రాముల ఉప్మా, మిక్చర్, సాంబరు ఉంటాయి. బుధ, శనివారాల్లో పొంగల్, సాంబార్, మిక్చర్ ఉంచుతున్నారు. మధ్యాహ్నం, రాత్రి భోజనం కింద సోమవారం నుంచి శనివారం వరకూ 400 గ్రాముల అన్నం, 120 గ్రాముల పప్పు లేదా సాంబార్, 100గ్రాముల కూర, 75 గ్రాముల పెరుగు, 15 గ్రాముల పచ్చడి అందజేస్తున్నారు. అన్న క్యాంటీన్ల వద్ద ఉదయం ఏడున్నర నుంచి పది గంటల వరకూ అల్పాహారం, మధ్యాహ్నం 12.30 నుంచి మూడు గంటల వరకూ భోజనం, రాత్రి ఏడున్నర గంటల నుంచి తొమ్మిది గంటల డిన్నర్ అందిస్తారు.

ఆదరణ బాగుంది

నగరంలో అన్న క్యాంటీన్లకు ఆదరణ బాగుంది. రోజురోజుకీ తాకిడి పెరుగుతోంది. ఎంవీపీ రైతుబజార్, కేజీహెచ్, వీజీహెచ్, మర్రిపాలెంలోని క్యాంటీన్‌లకు అధికంగా జనం వస్తుండగా, నమ్మిదొడ్డి, భీమిలిలోని క్యాంటీన్‌లకు తాకిడి కొంత తక్కువగా ఉంది. తాకిడికి అనుగుణంగా ఆహార సరఫరాను సర్దుబాటు చేస్తున్నాం.

తహసీల్దార్ల బదిలీల్లో సిఫారసులకే పెద్దపీట!

... 5వ పేజీ తరువాయి

బదిలీ చేస్తూ ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు. డిప్యూటీ తహసీల్దార్లను కూడా నగరం, దానికి ఆనుకుని మండలాల్లో అటుఇటుగా సర్దేశారు తప్ప ఏజెన్సీకి బదిలీ చేయలేదు. విశాఖ ఆర్డీవో కార్యాలయంలో డీటీగా పనిచేసే సూర్యకళ (53 సంవత్సరాలు)ను ఏజెన్సీకి బదిలీ చేయడంపై రెవెన్యూ వర్గాల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతుంది. యువకులకు కాదని 50 ఏళ్లు దాటిన ఒంటరి మహిళను ఏజెన్సీకి పంపడం సమంజసం కాదనే వాదన వినిపిస్తోంది.

అస్త్రశస్త్రాలతో ఇరుపక్షాలు రెడీ

... 5వ పేజీ తరువాయి

వివరాలను సంబంధిత విభాగాల అధికారులను కోరాలని కూటమి నేతలు, కార్పొరేటర్లు నిర్ణయించినట్టు సమాచారం. మరోవైపు కౌన్సిల్‌లో బలం కోల్పోయిన వైసీపీ కూడా కూటమి దాడిని తిప్పికొట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేసుకుంటోంది. అందులో భాగంగానే మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన సోమవారం వైసీపీ కార్పొరేటర్ల షాడో సమావేశం జరిగింది. అందరూ ఉమ్మడిగా కూటమి కార్పొరేటర్ల ఎదురుదాడిని, ఆరోపణలను తిప్పికొట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగరంలో జరిగిన కొన్ని అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగిందనే ఆరోపణలతో వారిని డిఫెన్స్‌లో పడేయాలని వైసీపీ కార్పొరేటర్లు భావిస్తున్నట్టు సమాచారం.

ఈపీడీసీఎల్‌లో కొనసాగుతున్న కసరత్తు

... 5వ పేజీ తరువాయి

ఇంజనీర్ పోస్టులు ఉండగా 72 మంది మాత్రమే కనిపిస్తున్నారని, మిగిలిన నలుగురు ఎక్కడ ఉన్నారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఈ కారణంగానే బదిలీల ఉత్తర్వులు సోమవారం రాత్రి తొమ్మిది గంటల వరకు బయటకు రాలేదు. దిగువ స్థాయి సిబ్బంది బదిలీలకు సంబంధించి మాత్రం నాలుగు ఉత్తర్వులు జారీచేశారు. ఎస్ఈలు, డీఈలు, ఏఈల బదిలీల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. మరోవైపు రాజకీయ సిఫారసులను కూడా పరిగణనలోకి తీసుకొని బదిలీలు చేయాల్సి ఉండడంతో అధికారులు బాగా ఇబ్బంది పడుతున్నారు.

హార్టీకల్చర్‌లో అంతా మాయే

... 5వ పేజీ తరువాయి

చూస్తుంది. ఆయా పనులను అధికారులు ఏటా టెండర్లు ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తుంటారు. నగరవ్యాప్తంగా 60 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిస్తే స్టీల్ ప్లాంటులో ఉద్యోగం చేస్తున్న ఇద్దరు వ్యక్తులు తమ కుటుంబ సభ్యుల పేర్లతో 40 శాతానికిపైగా లెస్‌కు వేసి పనులు దక్కించుకుంటున్నారు. టెండరు దక్కిన తర్వాత పనులు చేయకుండానే అధికారుల అండదండలతో బిల్లులు చేసుకుంటున్నారు. టెండరు గడువు ముగిసిన తర్వాత తిరిగి టెండర్లు పిలవాల్సి ఉన్నా, పాతవారికే నామినేషన్ పద్ధతిపై పనులు అప్పగించడంపై ఆరోపణలు రావడంతో మేల్కొన్న అధికారులు తమ తప్పులేదని తప్పించుకునేందుకు వీలుగా కొత్తవ్యూహానికి తెరదీశారు. రూ.1.91 కోట్లు విలువైన 15 పనులకు శనివారం గుట్టుగా షార్ట్‌టెండర్ పిలిచారు. టెండర్‌లో పాల్గొనేందుకు కాంట్రాక్టర్లకు కేవలం మూడు రోజులు మాత్రమే అవకాశం కల్పించారు. సాధారణంగా టెండరు పిలిచినా ఇబ్బంది లేనప్పటికీ ఎందుకు షార్ట్‌టెండర్ పిలవాల్సి వచ్చిందనే దానిపై అధికారులు నోరువిప్పకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. సాధారణంగా టెండరు నోటిఫికేషన్ జారీచేస్తే కనీసం 20 రోజులు బిడ్ దాఖలకు అవకాశం ఉంటుంది. అలా అయితే ఎక్కువ మంది కాంట్రాక్టర్లు బిడ్ వేస్తారు కాబట్టి, తమ అస్మదీయులు మాత్రమే టెండర్‌లో పాల్గొనేలా చేసి వారికే పనులు దక్కేలా చేసేందుకే అధికారులు షార్ట్‌టెండర్ వ్యూహాన్ని అమలుచేసి ఉంటారని అంటున్నారు. హార్టికల్చర్ విభాగంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కమిషనర్ సంపత్‌కుమార్ దృష్టిసారించకపోతే నగర సుందరీకరణ ఆటకెక్కడంతోపాటు జీవీఎంసీ నిధులు కాంట్రాక్టర్లు, అధికారుల జేబుల్లోకి వెళ్లిపోవడం ఖాయమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

జడ్పీలో బదిలీలు

... 5వ పేజీ తరువాయి

బదిలీ కాగా అక్కడ కార్యాలయ సూపరింటెండెంట్ డి.సీతారామరాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నర్సీపట్నం ఎంపీడీవో ఎం.జయమాధవిని రాంబిల్లి, అక్కడ ఉన్న కేఎస్ కొండలరావును ఎలమంచిలి బదిలీ చేశారు. ఎలమంచిలి ఎంపీడీవో కె.అప్పలనాయుడు వేరే జిల్లాకు బదిలీపై వెళ్లారు. రోలుగుంట ఎంపీడీవో కె.ప్రభాకరరావును అచ్యుతాపురం బదిలీ చేసి...ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన వీఎస్ నాగేశ్వరరావుకు నియమించారు. కొత్తగా వచ్చిన వి.అప్పారావుకు వి.మాడుగుల ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. చింతపల్లి ఎంపీడీవో పి.ఆశాజ్యోతిని పాడేరు బదిలీ చేసి, ఆమె స్థానంలో కొత్తగా వచ్చిన ప్రేమ్‌సాగర్‌ను నియమించారు. పాడేరులో పనిచేస్తున్న కె.సాయినవీన్‌ను పొరుగు జిల్లాకు కేటాయించారు. జి.మాడుగుల ఎంపీడీవో లోహిత్‌సాగర్ మరో జిల్లాకు వెళ్లగా అతని స్థానంలో కొత్తగా వచ్చిన తేజ్‌రతన్‌ను నియమించారు. అలాగే హుకుంపేట ఎంపీడీవో ఆర్.వెంకటరావు పొరుగు జిల్లాకు వెళ్లగా అతని స్థానంలో కొత్తగా వచ్చిన టి.రమాదేవికి పోస్టింగ్ ఇచ్చారు. ముంచంగిపుట్టు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ ఇతర జిల్లాకు వెళ్లగా ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన ఎం.శ్రీసాయిహర్షను, పెదబయలు ఎంపీడీవో విగిన్ బక్కా ఇతర జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన కేవీ ప్రసాద్‌ను నియమించారు. కాగా పద్మనాభం (విజయకుమార్), అనకాపల్లి (కేవీ నరసింహరావు), కశింకోట (వీవీ రవికుమార్), కోటవురట్ల (జి.కాశీవిశ్వనాథరావు), రావికమతం (వెంకన్నబాబు), డుంబ్రిగుడ (ఎం.ఉషారాణి), గూడెంకొత్తవీధి (వై.ఉమామహేశ్వరరావు) ఎంపీడీవోలను అక్కడే కొనసాగించారు. అనంతగిరి ఎంపీడీవో స్టడీ లీవ్‌లో ఉండగా అక్కడ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మాకవరపాలెం, పెందుర్తిలో ఎవరినీ నియమించలేదు.


పల్లా శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న దామినేని శ్రీనివాస్

అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.25 వేల విరాళం

ఆటోనగర్, సెప్టెంబరు 23: స్థానిక అన్న క్యాంటీన్‌లో వసతులు, నిర్వహణ నిమిత్తం ఆటోనగర్ డీ-బ్లాక్‌కు చెందిన పూర్వి ఎలక్ట్రోడ్స్ ఛైర్మన్ దామినేని శ్రీనివాస్ సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు రూ.25 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆటోనగర్ పారిశ్రామికవేత్తలు స్వచ్ఛందంగా లక్షలాది రూపాయలతో తినుబండారాలు, నిత్యావసరాలను అందించారన్నారు. అన్న క్యాంటీన్ నిర్వహణకోసం ముందుకు వచ్చిన దామినేని శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగప్రసాద్, ఐలా మాజీ ఛైర్మన్ యార్లగడ్డ సాంబశివరావు, రామ్‌ప్రసాద్, పరుచూరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి సత్కారం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 23: విజయవాడలో వరద బాధితులకు సేవలందించిన 68వ వార్డులోని పారిశుధ్య సిబ్బందిని కార్పొరేటర్ గుడివాడ అనూష సోమవారం మిందిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుధ్య సిబ్బంది సేవలను ప్రభుత్వం గుర్తించి తగిన విధంగా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుడివాడ లతీశ్, ఈటి సురేశ్, బి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ కాలేజీలో పాన్ కార్డు మేళా

అగనంపూడి, సెప్టెంబరు 23: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం పాన్‌కార్డు మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జె.సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన ఆర్థిక సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈమేళాను ఏర్పాటు చేశామన్నారు. నూతనంగా పాన్ కార్డుల మంజూరుతో పాటు ప్రస్తుతమున్న కార్డుల్లో తప్పులను సవరించేందుకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. ఇదిలావుంటే ఈమేళాకు విశేష స్పందన లభించింది. ఈకార్యక్రమంలో రెక్టార్ వి. మధుసూదనరావు, కో- ఆర్డినేటర్ సన్యాసిరావు, డీన్లు, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

అగనంపూడి, సెప్టెంబరు 23: అగనంపూడి కూడలిలో బీజేపీ 79వ వార్డు నాయకుల ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు అధ్యక్షుడు కోసూరి తాతారావు మాట్లాడుతూ బీజేపీపై ఉన్న నమ్మకంతో దేశ వ్యాప్తంగా రెండు కోట్ల మంది సభ్యత్వం తీసుకున్నారన్నారు. యువత బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆషాలత, శంకరరావు, సంతోశ్, కుమారి, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నడుపూరు హైస్కూల్ డైరీ ఆవిష్కరణ

పెదగంట్యాడ, సెప్టెంబరు 23: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు రూపొందించిన డైరీని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం ఆవిష్కరించారు. హైస్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు డైరీ నిర్వహించడం నూతన సంప్రదాయమన్నారు. ఈ విధానాన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని జిల్లా విద్యాశాఖాధికారులకు సూచించారు. పాఠశాల ప్రగతికి కృషి చేస్తున్న హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్‌ను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, స్కూల్ యాజమాన్య కమిటీ ఛైర్‌పర్సన్ పుష్పాంజలి, వైస్ ఛైర్‌పర్సన్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 52, టమాటా 44, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 32, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 44, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 24, క్యారెట్ 38, దొండకాయలు 32, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 80, మునక్కాడలు (కిలో) 70, బరబాటి 50, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 72, పొటల్స్ 44, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ I లో..



మాక్ డ్రిల్‌లో భాగంగా లిక్విడ్ ఆక్సిజన్ లీకేజీని అరికడుతున్న దృశ్యం. (ఇన్‌సెట్లో) ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని స్ట్రెచర్‌పై తీసుకువెళుతున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

'ఉక్కు'లో అబ్బురపరిచిన మాక్ డ్రిల్

తొలుత మాక్ డ్రిల్ అని తెలియక భయాందోళనకు గురైన ఉద్యోగులు, కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 23: స్టీల్‌ప్లాంటులో సోమవారం ఒక్కసారిగా పొగలు కమ్ముకోవడంతో ఉద్యోగులు, కార్మికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే ఇదంతా ప్లాంట్ లెవెల్ మాక్ డ్రిల్ అని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. మాక్ డ్రిల్ ఆద్యంతం చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. ప్లాంటులో ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఏ విధంగా వ్యవహరించాలనే అనే అంశంపై కర్మాగారంలోని ఎయిర్ సెపరేషన్ ప్లాంట్-1 వద్ద లిక్విడ్ నైట్రోజన్ ట్యాంక్ నుంచి లిక్విడ్ ఆక్సిజన్ లీక్ అయినట్టు చేశారు. అలాంటి సమయంలో ఏ విధంగా వ్యవహరించాలి, ప్రాణాలను ఎలా కాపాడుకోవాలి, సంస్థకు నష్టం వాటిల్లకుండా ఎలా ముందుకు సాగాలి, దురదృష్టవశాత్తు ఎవరైనా గాయపడితే ఎటువంటి చర్యలు చేపట్టాలో మాక్ డ్రిల్ ద్వారా కళ్లకు కట్టినట్టు సీఐఎస్ఎఫ్ సిబ్బంది చూపించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేశ్, డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ స్వప్నలత, ఎన్విరాన్‌మెంట్ అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మి, ప్లాంట్ సీజీఎం ప్రవీణ్‌కుమార్, యుటిలిటీస్ విభాగాధిపతి కె.శ్యామ్‌బాబు, సేఫ్టీ విభాగాధిపతి ఎం.సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.


పెదగంట్యాడలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, సెప్టెంబరు 23: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అనేక పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేదలకు విద్య వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు, నిరుద్యోగులకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన హామీ మేరకు సామాజిక, దివ్యాంగుల పెన్షన్లను పెంచడంతో పాటు అన్ని హామీలను నెరవేరుస్తూ ప్రజాదరణతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని పల్లా పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి మాట్లాడుతూ పేదలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో జెడ్సీ శేషాద్రి, డిప్యూటీ కలెక్టర్ పద్మలత, తహసీల్దార్ రామారావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, దల్లి గోవింద్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేశ్‌బాబు, నాయకులు కోన తాతారావు, పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ముందుగా పీహెచ్‌సీ ఆవరణలో రూ.50 లక్షలతో నిర్మించనున్న మెడికల్ ల్యాబ్ భవన నిర్మాణానికి పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు.

ప్రభుత్వ పాలనకు మంచి స్పందన

కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. నడుపూరు రామాలయం ఆవరణలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. గ్రేటర్ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి నిర్దిష్టమైన లక్ష్యం ఉందన్నారు. పలువురు అధికారులు, కూటమి నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నల్లూరు సూర్యనారాయణ, తదితరులు

వంద రోజుల పాలనలో అనేక విజయాలు: ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అనేక విజయాలతో ప్రజల మన్నన పొందుతోందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 59వ వార్డు మాజీ సైనికుల కాలనీ, 60వ వార్డు ఇందిరా కాలనీ సాయిబాబా గుడివద్ద నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్సీ రాము, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, నాయకులు విశ్వనాథుల దినకర్, మిటిరెడ్డి శంకర్, రామ్మోహన్‌నాయుడు, సురేశ్‌యాదవ్, మాతా శ్రీను, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

52వ వార్డులో..

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 52వ వార్డు పరిధి శాంతినగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అందరికీ మేలు చేసేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వంద రోజుల్లో ఎంతో పురోగతి సాధించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కోసం ప్రత్యేక బస్సులు త్వరలో రానున్నాయన్నారు. అనంతరం వరదల సమయంలో విజయవాడలో సేవలందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, సూపర్‌వైజర్లు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఎ.శ్రీనివాస్, డీఈ ఏడుకొండలు, ఏఈ ఉషారాణి, నాయకులు, ఎం.వాసుదేవరావు, వై.తిరుమలరావు, శ్రీనివాస్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో..

కూర్మన్నపాలెం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. వార్డు పరిధిలోని సాయిబాలాజీ నగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నల్లూరు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలను అందించడంతో పాటు ఇళ్ల గోడలకు స్టిక్కర్లను అతికించారు. జనసేన నాయకుడు కాద శ్రీను మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెలుగు రాష్ట్రాలకు రూ.కోటి రూపాయల చొప్పున, గ్రామ పంచాయితీలకు మొత్తం రూ.నాలుగు కోట్లు అందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు మాడిశ కనకరాజు, వేగుంట శ్రీనివాస్, వీరభద్రరావు, తులసి, రాజు, బాబా, తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో..

అగనంపూడి: గ్రేటర్ 79వ వార్డు పరిధి శివాజీనగర్‌లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సింగిడి సింహాచలం, వెంకటేశ్వరరావు, జి.రుద్రకుమార్, మేడిశెట్టి నరేశ్, మరణమూర్తి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

93వ వార్డులో..

వేపగుంట: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 93వ వార్డు పరిధి సాయిమాధవనగర్, పల్లి నారాయణపురంలో ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. నాయకులు ఎం.దుర్గాప్రసాద్, పురుషోత్తమ్, బి.రవి, సచివాలయ సిబ్బంది హజరత్ ఇబ్రహీమ్, అబ్దుల్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి మండల టీడీపీలో రాజుకున్న వివాదం

నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ వైఖరిపై కార్యకర్తలు గుర్రు

పెందుర్తి, సెప్టెంబరు 23: పెందుర్తి మండల తెలుగుదేశం పార్టీలో వివాదం రాజుకుంటోంది. ముఖ్య నేతలు, కార్యకర్తలు ఆ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ వైఖరిపై గుర్రుగా ఉన్నారు. ఈ మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో అత్యవసరంగా భేటీ అయిన నేతలు సోమవారం జెర్రిపోతులపాలెంలో రహస్యంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి గండి బాబ్జీ కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా వైసీపీతో నేతలతో కలసి, ఆ పార్టీకి చెందిన వారిని తెలుగుదేశంలోకి చేర్చుకుంటున్నట్టు ఆరోపించారు. దీనివల్ల పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. చింతగట్ల గ్రామ సర్పంచ్ భర్త, వైసీపీ నేత గనిశెట్టి కనకరాజు, పెదగాడి ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు మరికొంత మంది వైసీపీ నేతలను బాబ్జీ టీడీపీలోకి చేర్చుకోవడంపై ఈ సమావేశంలో పార్టీ నేతలు పలు వురు అభ్యంతరం వ్యక్తం చేశారు. నేర చరిత్ర గల వైసీపీ నాయకులను టీడీపీలో చేర్చుకోవడంపై వారు మండిపడినట్టు సమాచారం. ఈ విషయంలో అవసరమైతే మూకుమ్మడి రాజీనామాలకు సైతం వారు సిద్ధమవుతున్నట్టు తెలియవచ్చింది. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ మడక పార్వతి, సర్పంచ్‌లు మడక అప్పలరాజు, గొర్లె రమాకృష్ణ, గొరపల్లి నరసింగరావు, సమన్వయకర్తలు కోరిబిల్లి సుందరరావు, ముక్కు రవిసుందర్, ఎంపీటీసీ సభ్యులు గండ్రెడ్డి మాలతీనగేశ్, యర్ర రమణ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి వెంకన్న ఆలయంలో పవిత్రోత్సవాలు

అగనంపూడి, సెప్టెంబరు 23: జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతి నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త ఈకే చారి తెలిపారు. ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు, హోమాలు, లక్ష కుంకుమార్చన, లక్ష తులసీపూజ, పూర్ణాహుతి, పంచామృతాభిషేకాలు జరుపుతామన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

శరన్నవ రాత్రి ఉత్సవాలకు పందిరి రాట


పందిరి రాట వేస్తున్న బొండా జగన్

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 23: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితిలో దుర్గాగౌరి యూత్ ఆధ్వర్యంలో సోమవారం శరన్నవ రాత్రి ఉత్సవాలకు సంబంధించి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ పందిరి రాట వేశారు. కార్యక్రమంలో నాయకులు రాజన్‌రాజు, సత్తిబాబు, గెద్దాడ రాంబాబు, పోతల కృష్ణ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఏ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

ఉక్కు సీఎండీని కోరిన కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 23: హెచ్‌ఆర్‌ఏ విషయంలో ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘ నాయకులు ఉక్కు సీఎండీని కోరారు. ఈ మేరకు సోమవారం స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనంలో సీఎండీ ఏకే బాగ్చీతో ఉక్కు కార్మిక సంఘ నాయకులు సమావేశమయ్యారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాల విషయంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయంతో కార్మిక వర్గం తీవ్ర అసంతృప్తితో ఉందని నాయకులు వివరించారు. ఇప్పటికే వేల రూపాయలు నష్టపోతున్న కార్మిక వర్గానికి ఇది మరో దెబ్బ అని అన్నారు. దేశంలో ఏ స్టీల్‌ప్లాంటులో లేని కార్మిక వ్యతిరేక విధానాలను విశాఖ ఉక్కు కర్మాగారంలో అమలు చేయటం సమంజసం కాదన్నారు. కార్మికుల్లో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా చర్యలు తీసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, జి.గణపతిరెడ్డి, నమ్మి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.


ఉక్కు సీఎండీ బాగ్చీతో మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకులు

రహదారి భద్రతా నిబంధనలపై ఆటోడ్రైవర్లకు అవగాహన

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 23: రహదారి భద్రతా నిబంధనలను భారంగా భావించకుండా అందరూ బాధ్యతగా తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందని దువ్వాడ ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు అన్నారు. వడ్లపూడి కూడలిలో సోమవారం ఆయన రహదారి భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడపరాదని, సెల్ ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని, లేన్ అండ్ డిస్‌ప్లే విధానాన్ని పాటించాలని, యూనిఫామ్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లను కలిగి ఉండాలని సూచించారు. అలాగే ప్రయాణికుల పట్ల గౌరవంగా మెలగాలన్నారు.


విద్యుత్ దీపాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గణబాబు

సింధియా రహదారికి విద్యుత్ వెలుగులు

మల్కాపురం, సెప్టెంబరు 23: మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ నుంచి సింధియా జంక్షన్ వరకు గల ప్రధాన రహదారి ఎట్టకేలకు విద్యుత్ వెలుగులతో నిండింది. ఎమ్మెల్యే గణబాబు రహదారి సెంటర్ డివైడర్‌లో జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఈ దీపాలను సోమవారం సాయంత్రం స్విచ్ ఆన్ చేసి వెలిగించారు. హెచ్‌పీసీఎల్ విస్తరణ సమయంలో ఈ విద్యుత్ దీపాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయితే, రిఫైనరీ విస్తరణ పనులు దాదాపు పూర్తవడంతో ఈ విద్యుత్ దీపాలను తిరిగి పునరుద్ధరించారన్నారు. ఇంతకాలం ఈ ప్రాంత ప్రజలు అటు ప్రభుత్వానికి ఇటు హెచ్‌పీసీఎల్‌కు ఎంతో సహకరించారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం సీఐ ఎస్.విద్యాసాగర్, టీడీపీ 61వ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్, డీఈ ఏడుకొండలు, నాయకులు రామ్మోహన్‌నాయుడు, ఎం.చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం 'ఆయుష్మాన్ భారత్'

గాజువాక, సెప్టెంబరు 23: ఆయుష్మాన్ భారత్ పథకం పేదల పాలిట వరమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే, పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి పీహెచ్‌సీ వద్ద సోమవారం నిర్వహించిన సఫాయి మిత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభించి ఆరేళ్లు అయిందన్నారు. ఈ పథకం కింద ఇప్పటివరకు ఎనిమిది కోట్ల మంది ప్రజలు వైద్యం పొందారన్నారు. 70 ఏళ్లు పైబడిన వారికి ఎటువంటి షరతులు లేకుండా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో రూ.ఐదు లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించడం జరుగుతుందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ దేశంలో ప్రతిఒక్కరూ ఆనందంగా ఉండాలన్నదే కేంద్రం లక్ష్యమన్నారు. అనంతరం పలువురికి ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు స్టాలిన్, రాజాన రామారావు, పల్లా శ్రీనివాసరావు, నాయకులు రోహిణి, గూటూరు శంకరరావు, గడసాల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం

గాజువాక, సెప్టెంబరు 23: గాజువాక మండల స్థాయి స్కూల్ గేమ్స్ సోమవారం ఇక్కడి హైస్కూల్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు చదువులో ఓ భాగం కావాలన్నారు. క్రీడలు ఆడేవారు శారీరకంగా, మానసికంగా ఎంతో ఉత్సాహంగా ఉంటారన్నారు. క్రీడల్లో పాల్గొనేవారు అన్ని రంగాల్లోనూ రాణిస్తారని, అందరూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయప్రశాంతి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల విజేత అక్కిరెడ్డిపాలెం హైస్కూల్..

అక్కిరెడ్డిపాలెం: గాజువాక హైస్కూల్ మైదానంలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో ఖోఖో బాలికల జూనియర్, సీనియర్ విభాగాల్లో, చెస్ జూనియర్ విభాగంలో ప్రథమ స్థానాన్ని, షటిల్ బాడ్మింటన్ జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానాన్ని తమ విద్యార్థినులు సాధించారని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం కాంతం తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను ఆమెతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు మహ్మద్ ఇస్మాయిల్, తదితరులు అభినందించారు.

స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలి


ధర్నాలో పాల్గొన్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 23: స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పలు సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్లాంట్‌ను పరిరక్షించాలంటూ సోమవారం స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దుర్మార్గంగా ముందుకు సాగుతుందన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తుందని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు మూల కారణమైన ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు చర్యలు చేపడుతుండడం సమంజసం కాదన్నారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేస్తే అన్ని విధాల బాగుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, అప్పారావు, రమణమూర్తి, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు డైరెక్టర్‌కు వినతిపత్రం

స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించవద్దని కోరుతూ ఉక్కు డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండేకు ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ప్రధానంగా హెచ్‌ఆర్‌ఏ, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, ఎల్‌టీఏ వంటివి నిలిపివేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకుడు ఎస్ఏ నాయుడు పాల్గొన్నారు.

'మైదానంలో బాణసంచా విక్రయాలు వద్దు'

మల్కాపురం, సెప్టెంబరు 23: శ్రీహరిపురం జీవీఎంసీ మైదానంలో రానున్న దీపావళికి బాణసంచా విక్రయాలను అడ్డుకోనున్నట్టు మైదానం వాకర్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. మైదానంలో సోమవారం వాకర్స్ క్లబ్ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ పాల్గొని మాట్లాడారు. ఏటా దీపావళి రోజుల్లో బాణ సంచా వ్యాపారులు మైదానాన్ని తీసుకొని స్టాల్స్ ఏర్పాటుచేసి పాడుచేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ సారి ఎట్టి పరిస్థితుల్లో బాణసంచా విక్రయాలను అడ్డుకొని తీరాలన్నారు. ఈ విషయాన్ని తాను కౌన్సిల్‌లో కూడా మాట్లాడనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

గోపాలపట్నం, సెప్టెంబరు 23: గోపాలపట్నం లక్ష్మీనగర్‌లో గ్రేటర్ జోన్-8 కార్మికులకు సోమవారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు(గణబాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య, తాగునీటి సరఫరా తదితర విభాగాలలో పనిచేసే వారు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్సీ హైమావతి, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులతో టిడ్కో ఇళ్లను అప్పగించాలి

పెదగంట్యాడ, సెప్టెంబరు 23: పెదగంట్యాడ, భానోజీ తోట ప్రాంతాల్లో నిర్మించిన టిడ్కో గృహసముదాయాలకు మౌలిక వసతులు కల్పించి తమకు అప్పగించాలని లబ్ధిదారులు పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం వద్ద ప్రదర్శన చేపట్టారు. దీంతో ఆ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని జెడ్సీ శేషాద్రికి ఆదేశించారు. ఈ మేరకు జెడ్సీ వారితో మాట్లాడారు. టిడ్కో గృహ సముదాయాలకు అన్ని వసతులు కల్పించాక ఎమ్మెల్యే దృష్టికి, జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం

అగనంపూడి, సెప్టెంబరు 23: ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ స్థానిక శాఖ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో గల దివ్యజ్యోతి భవనం వద్ద సోమవారం సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. 108 మంది దంపతులతో రాజయోగి బీకే మంజునాథ్ వ్రతాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి భావనతో ఎప్పుడైతే వ్రతం చేస్తామో అప్పుడు సంపూర్ణ ఫలితాలు వస్తాయన్నారు. ప్రజలందరికీ మంచి చేయాలనే ఉద్దేశంతో బ్రహ్మకుమారీస్ సంస్థ వ్రతాన్ని చేపట్టిందన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సోమేశ్వరి, రామకోటి, స్థానిక నాయకులు పూర్ణనందశర్మ, బి.సత్యనారాయణ, విందుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో మరిన్ని వసతుల కల్పన: వంశీకృష్ణ



కార్డియాలజీ విభాగంలో పరికరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మహారాణిపేట, సెప్టెంబరు 23: కేజీహెచ్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కేజీహెచ్‌లో పర్యటించారు . రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వివిధ విభాగాల వార్డులలో ప ర్యటించారు. వైద్య సిబ్బంది పనితీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో ఆస్ప త్రి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఆధునాతన సదుపాయాలతో మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ రహమాన్ ఆధ్వర్యంలో భారతిగిరి సొంత నిధులతో సమకూర్చిన కార్డియాలజీ విభాగంలో ఈసీజీ మానిటర్లు, బీబీ ఆపరేటర్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అధికారులు పాల్గొన్నారు.

పవన్ దీక్షకు మద్దతుగా జన సైనికుల పూజలు



గోవింద నామ స్మరణలో ఉషాకిరణ్, నాయకులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 23: తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలతో తయారు చేసిన నెయ్యి వాడడం దుర్మార్గమని ఉత్తర నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. గత వైసీపీ పాలకులు తిరుపతి లడ్డూ తయారీలో చేసిన అపరాధాలను క్షమించాలని ప్రార్థిస్తూ జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని వినాయక మండపంలోని గణనాథుడికి పూజలు చేశారు. సాముహిక గోవింద నామ స్మరణ చేశారు. ఈ కార్య క్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, నాయకులు శ్రీధర్, దివాకర్, అప్పారావు, నాగమణి, బండి కన్నా, వాసు, త్రినాథ్ పాల్గొన్నారు.

కళల ద్వారా మానసిక ప్రశాంతత



గాయనీగాయకులు సన్మానిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 23: కళల ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు గాయకులు అన్నారు. సంగీత కళా రంగానికి విశేష సేవలందిస్తున్న గాయక దంపతులు విశ్వప్రసాద్, కోమలిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. విజయ విశాఖ మ్యూజికల్స్ ఈవెంట్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా గాయక దంపతులు విశ్వప్రసాద్, కోమలి పాడిన గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. విజయ సారథ్యం వహించిన కార్యక్రమంలో రెడ్డి ప్రభ, అలేఖ్య, తులసి, శోభ, సత్యవతి, పింకీ, ఎస్.ఎన్. రావు, వెంకట్, హిమ, కైలాష్, శ్రీనివాస్, మధు గీతాలు ఆలపించి అలరించారు.

విద్యార్థినులు సమాజాన్ని చైతన్యవంతం చేయాలి



ర్యాలీ చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 23: విద్యార్థినులు సమాజ చైతన్యం చేసేందుకు కృషి చేయాలని ఆంధ్రయూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ హరినాథ్, ఫైడా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సరోజ్ పేర్కొన్నారు. సోమవారం డాబాగార్డెన్స్ పాత జైల్‌రోడ్డులోని ఫైడా మహిళా కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురు విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. ఆంధ్ర యూనివర్సిటీలో విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హరినాథ్, సరోజ్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజాన్ని చైతన్యవంతం చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రామశేషు, ఫైడా డిగ్రీ కళాశాల ప్రోగ్రామ్ ఆఫీసర్ మౌనిక, అగర్వాల్ ఐ ఆస్పత్రి వైద్య బృందం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రమిస్తున్న కార్పొరేటర్ అప్పారావు

కంచరపాలెం, సెప్టెంబరు 23 : జీవీఎంసీ 48వార్డు పరిధి కొండవాలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ గంకల కవితా అప్పారావు ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం ఎమ్మెల్యేను తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి ప్రతమిచ్చారు. వార్డులో కనీస వసతులైన రోడ్లు, కాలువలు, రిటర్నింగ్ వాల్స్ నిర్మాణానికి చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే, ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన రోడ్లు, కాలువలకు మరమ్మతులు చేపట్టాలని అన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అభివృద్ధి పనులను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, తదితరులు

మాజీ సీఎం జగన్ రూ. వేల కోట్లు దోచేశారు

» ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 23 : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రూ.30 వేల కోట్లు దోపిడీ చేశారని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు. గ్రేటర్ 42, 43 వార్డులకు సంబంధించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎనభై అడుగుల రోడ్డులో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్మోహన్‌రెడ్డి వేలాది కోట్ల రూపాయలను దోచేశారన్నారు. అంతేకాకుండా రాష్ట్రం రూ. 135 వేల కోట్లు అప్పులు చేశారన్నారు. అయినా, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. విశాఖలో గంజాయిని అరికట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, నాయకులు ఆకిరెడ్డి జగదీష్, జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, 43వ కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, టీడీపీ, బీజేపీ, జనసేన వార్డు అధ్యక్షులు కన్నం వెంకటరమణారావు,బొడ్డేటి మోహనరావు, గురుగోవింద్ సింగ్, ము తమ్మన నాగమణి, ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నాయకులు ముప్పాళ్ళ శ్రీకృష్ణ, కొయిలాడ వెంకటేష్, లొడగల కృష్ణ, తోట శ్రీదేవి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన: వంశీకృష్ణ

పూర్ణామార్కెట్: పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రేటర్ 35 వార్డులో జరిగిన ఇది మీ ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వంద రోజుల పాలనలో పేదలకు పెన్షన్ల పెంపు, పేదల కోసం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డులోని మహిళలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, పూర్ణామార్కెట్ వరసిద్ధి వినాయక వర్తక సంఘం కార్యదర్శి గంగాడ గోవింద్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేష్ ఆధ్వర్యంలో 44వ వార్డులోని 238, 239 సచివాలయాల పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి ప్రజలకు వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లను పంపిణీ చేస్తున్నారని, అన్న క్యాంటీన్లు ప్రారంభించి రూ.5కే పేదల కడుపునింపుతున్నారన్నారు. సచివాలయ అడ్మిన్లు శివకృష్ణ, రాజేష్, కూటమి నాయకులు కాళ్ల గౌరీశంకర్‌నాయుడు, రఘునాథ్, ఎం.మోహన్‌రావు, పందిరిపల్లి శ్రీను, అమ్మారావు, రెడ్డి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం: రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటికి మంచి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం జీవీఎంసీ 34 వార్డు ఆచ్యయ్యమ్మపేటలో నిర్వహించిన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రజలంతా స్వర్ణాంధ్ర -2047 సర్వేలో పాల్గొని రాష్ట్ర అభివృద్ధికి సలహాలు సూచనలు అందించాలని కోరారు.అనంతరం వందరోజుల పాలనపై ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్,జోన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు,ఏపీడీ పద్మావతి, టీడీపీ నాయకుడు వాసుపల్లి రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 55వార్డు పరిధి గంగన్న నగర్, జోగారావు నగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని వార్డు టీడీపీ నాయకురాలు ఈతలపాక సుజాత సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా సుజాత ఇంటింటికీ వెళ్లి 100 రోజుల పూర్తిచేసుకున్న నేపథ్యంలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు.కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు గంట్యాడ వీరుబాబు,ఈశ్వరరావు,సచివాలయ సిబ్బంది చైతన్య,శోభన్ పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర- 2047'పై అవగాహన



పోస్టరు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

మహారాణిపేట, సెప్టెంబరు 23: గ్రామ సభలు, ఇతర వేదికల్లో స్వర్ణాంధ్ర-2047పై అవగాహన కల్పించనున్నట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. దీనిని సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం జేసీ, ఆర్‌డీవో, డీఆర్‌వోలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పోస్టర్‌ను ప్రతీ ప్రభుత్వ కార్యాలయం వద్ద అతికించాలని సూచించారు. స్వర్ణాం ధ్రపై తమ అభిప్రాయాలు, సలహాలను ప్రభుత్వానికి అందించాలని ప్రజలకు సూచించారు. జిల్లా నుంచి 50 వేల ఫీడ్ బ్యాక్‌లను స్వీకరించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులంతా భాగస్వాములైన తమ అభిప్రాయాలు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్యశిబిరం

అల్లిపురం,సెప్టెంబరు 23: పరిసరాలను పరిశుభ్రతకు అనునిత్యం పాటుపడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్న పారిశుధ్య కార్మికులు నిజమైన హీరోలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జీవీఎంసీ 34 వార్డు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్మికుల కోసం సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. జీవీఎంసీ కమిషనర్ పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడారు. వైద్యులు పారిశుధ్యకార్మికులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జోన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీకి వినతి

మహారాణిపేట, సెప్టెంబరు 23: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతానికి పైగా ఫీజు రాయితీ కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న అక్రిడేషన్లు జారీ చేయాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. సోమవారం కలెక్టర్‌ను జర్నలిస్టు సంఘాల ప్రతినిధి పి. సత్యనారాయణ ఆధ్వర్యంలో కలసి వినతి పత్రమిచ్చారు. జర్నలిస్టు సంఘాల హెల్త్ స్కీమ్ కింద ప్రీమియం చెల్లింపునకు సీఎస్‌ఆర్ నిధులు కేటాయించినట్టు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు ఆర్. రామచంద్రరావు కె. చంద్ర మోహన్, కె.ఎం. కీర్తన్, ఎ. శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

జ్ఞానాపురం,సెప్టెంబరు 23: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కారమ య్యేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము ఆదేశించారు. సోమవారం ఉదయం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజా వేదిక నిర్వహించారు. మొత్తం 7 అర్జీలను స్వీకరించారు.వీటిలో పట్టణప్రణాళికా విభాగానికి 4, రెవెన్యూకు 2, పబ్లిక్ వర్క్స్ విభాగానికి ఒకటి వచ్చినట్టు ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ టి.ఎస్.ఎన్.రాజు, ఇంజనీరింగ్ ఈఈ తారా ప్రసన్న, టీపీఓ విజయ్‌కుమార్, ఆర్‌లు బాబురావు, రాజ్యలక్ష్మి, ఏపీడీలు చిరంజీవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తమ వారినే తీసుకోవాలని రగడ

» అన్న క్యాంటీన్ వద్ద టీడీపీ 35వ వార్డు అధ్యక్షుడు హల్‌చల్

జగదాంబ కూడలి, సెప్టెంబరు 23: గ్రేటర్ 35 వార్డు ఇందిర గాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న అన్నక్యాంటీన్‌లో తమవారినే నియమించాలని కోరుతూ కొంత మంది టీడీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. సోమవారం ఆ పార్టీ వార్డు అధ్యక్షుడు బొచ్చారామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ మేరకు హల్‌చల్ చేశారు. వివరాలివి.. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లను పునరుద్ధరించిన విషయం తెలిసిందే. పూర్ణామార్కెట్ పరిధిలోని ఇందిరా మున్సిపల్ స్టేడియం దరిలోని అన్న క్యాంటీన్ ఇటీవల తెరిచారు. వీటి నిర్వహణ బాధ్యతలను హరే కృష్ణ మూమెంట్‌కు అప్పగించారు. క్యాంటీన్లలో అవసరమైన సిబ్బందిని సైతం ఆ సంస్థ నియమించింది. అయితే, వార్డు అధ్యక్షుడు రామిరెడ్డి, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, జనసేన నాయకులు తాము సూచించిన వ్యక్తులకే ఈ క్యాంటీన్లలో ఉద్యోగులుగా కోరారు. ఈ మేరకు హరేకృష్ణా మూమెంట్ సంస్థ ఈ క్యాంటీన్ లోపల పనిచేసిన వారందరినీ టీడీపీ వార్డు అధ్యక్షుడు, జనసేన నాయకులు సూచించిన వ్యక్తులనే నియమించింది. ప్రస్తుతం క్యాషియర్‌గా పనిచేస్తున్న సంధ్యను సైతం విధుల నుంచి తొలగించాలంటూ టీడీపీ వార్డు అధ్యక్షుడు రామిరెడ్డి క్యాంటీన్ వద్దకు వెళ్లి సోమవారం ఉదయం రగడకు దిగారు. క్యాషియర్ సీటులో ఉన్న సంధ్యను బలవంతగా లేపి, తమకు అనుకూలంగా ఉన్న మరో యువతిని కూర్చోపెట్టారు. అన్నక్యాంటీన్ నిర్వాహకులు చేసేది లేక ప్రస్తుతం పనిచేస్తున్న క్యాషియర్ సంధ్యను విధుల నుంచి తొలగించడం గమనార్హం. తనపైనే కుటుంబ పోషణ భారం ఉందని, ఇలా అర్ధాంతరంగా తొలగించడంతో వీధిన పడతామని ఆమె ఆవేదన వ్యక్తంచేస్తోంది.



ఇందిర మున్సిపల్ స్టేడియం వద్ద అన్నక్యాంటీన్‌లో రామిరెడ్డి వాగ్వాదం

తొలుతనుంచి కోరుతున్నాం: -వార్డు అధ్యక్షుడు రామిరెడ్డి

ఈ వ్యవహారంపై టీడీపీ అధ్యక్షుడు బి.రామిరెడ్డి 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, అన్న క్యాంటీన్‌లో తమ వారినే నియమించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణకు కోరామన్నారు. అలా కాకుండా వేరే వారికి అవకాశం కల్పిస్తారని హరేకృష్ణ మూమెంట్ నిర్వాహకులను ప్రశ్నించారు.

విద్యుత్ అండర్‌గ్రౌండ్ సిస్టం పూర్తి చేయాలి

» ఎంపీ శ్రీభరత్



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 23: త్వరితగతిన అండర్‌గ్రౌండ్ సిస్టమ్‌ను సిటీ మొత్తం పూర్తి చేయాలని ఎంపీ శ్రీభరత్ సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ ఈస్టర్ పవర్ డిస్ట్రిబ్యూషన్ అధికారులతో ఎంపీ శ్రీభరత్ సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికారులు సమన్వయంతో పనిచేయడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని కొనియాడారు. కేంద్రం నుంచి వస్తున్నా రీ వాంప్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్, ప్రధాన మంత్రి కుసుమ్ , సూర్య ఘర్ యోజన తదితర పథకాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో సోలార్, ఇతర పునరుత్పాదకాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అర్హులందరికీ సబ్సిడీలు అందించేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు.

గ్రామీణ క్రీడాకారుడికి ఆర్థిక సాయం

సీతమ్మధార, సెప్టెంబరు 23: తైక్వాండోలో చీఫ్ కోచ్ డాక్టర్ పాండ్రంగి రుక్మాకర్ రావు వద్ద శిక్షణ పొంది పలు పతకాలను సాధించిన కొత్తవలస మండలం కంటకాపల్లికి చెందిన క్రీడాకారుడు ములపర్తి ప్రకాశరావుకి ఎలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 105 తరపున ఎలయన్స్ గవర్నర్ దండెం పోలారావు సమక్షంలో సంస్థ పూర్వాధ్యక్షుడు బి.తిరుపతిరాజు చేతుల మీదుగా రూ.60వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్ అపార్టుమెంట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తిరుపతిరాజు మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన మలేషియాలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న తైక్వాండో పోటీల్లో పాల్గొనేందుకు ప్రకాశరావు వెళ్తున్న నేపథ్యంలో ఆయనకు ఆర్థిక సాయం చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోచ్ రుక్మాకరరావు, ఎలయన్స్ క్లబ్ ప్రతినిధులు మట్టపల్లి విశ్వేశ్వరరావు, డి.ఆర్.కె. రావు, కె.చంద్రశేఖర్‌రావు, ఎ.ఉషారాణి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్స్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలో అయోమయం

మల్కాపురం, సెప్టెంబరు 23: విశాఖపట్నం ఆయిల్ ట్యాంకర్స్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికపై ఉత్కంఠత నెలకొలంది. అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి చేపట్టిన ఓట్ల లెక్కింపులో తలెత్తిన తేడాతో సమస్య నెలకొంది. ఈ ఎన్నికలో ఓటింగ్ చేసే వారి సంఖ్య 204 కాగా, అధ్యక్ష పదవి కోసం ఇద్దరు అభ్యర్థులు పోటీపడ్డారు. వీరిలో ఒక్కరికి 220, మరొక్కరికి 221 ఓట్లు నమోదయ్యాయి. అయితే, ఓట్లు వేసిన వారు 204 మంది అయితే, ఒక్కరికి 220, ప్రత్యర్థికి 221 ఓట్లు లెక్కింపులో తేలడంతో ఎన్నికల నిర్వహణ అధికారులు అయోమయానికి లోనయ్యారు. దీంతో ఈ ఫలితంపై ఎటువంటి ప్రకటన చేయలేదు. ఇక, అదే ప్రధాన కార్యదర్శి స్థానానికి పోటీకి వస్తే.. ఒకరికి 112 ఓట్లు..మరొక్కరికి 99 ఓట్లు పోలయ్యాయి. ఈ స్థానానికి విజేతను ప్రకటించడానికి వీలున్నా, దీనిపైనా ప్రకటన చేయలేదు. బుధవారం ఈ విషయమై స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు సమావేశమై తీర్పు ఇవ్వనున్నారు. అయితే, ముందస్తుగా స్పష్టమైన జాబితా రూపొందించకుండా ఎన్నిక నిర్వహించడంతో సమస్య తలెత్తినట్టు సభ్యులు చెబుతున్నారు.

29న పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 23: పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి ఆరవ రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ జరగనుంది. రైల్వే స్విమ్మింగ్ పూల్‌లో జరిగే ఈ టోర్నీ పోస్టర్ కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో పతిభ కనబరిచిన స్విమ్మర్లు జాతీయ స్థాయి టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి రామస్వామి వివరించారు. ఇక రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొనేవారు ఈనెల 25వ లోపు ఫోన్: 7013569514, 9390131777 నందు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్, పారా స్పోర్ట్సు అసోసియేషన్ ప్రతినిధులు శీతల మదన్, జ్యోతి, శివ గంగ దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి నారా లోకేశ్ రాక

... 5వ పేజీ తరువాయి

గంటలకు బయలుదేరి 9.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి రాత్రి 10.10 గంటలకు సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వెనుక ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేస్తారు. ఈనెల 25వ తేదీన దేశంలో ప్రముఖ ఐటీ కంపెనీల ప్రతినిధులతో నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించే సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. అనంతరం రుషికొండ ఐటీ పార్కును సందర్శించి అక్కడ ఉద్యోగులు, నిపుణులతో భేటీ అవుతారు. బుధవారం రాత్రి తిరిగి విజయవాడ వెళతారు.

అన్న క్యాంటీన్‌లకు విశేష ఆదరణ

... 5వ పేజీ తరువాయి

మూసివేయడంతో పేదలకు ఇక్కట్లు మొదలయ్యాయి. కొంతమంది అర్ధాకలితో అలమటించేవారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నక్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. జీవీఎంసీ పరిధిలో 25 చోట్ల అన్నక్యాంటీన్లను పునఃప్రారంభించింది. దీంతో నిరుపేదలు, దినసరికూలీలు, ఎలాంటి ఆధారంలేని వారిముఖాల్లో ఆనందం వెల్లివెరిసింది. విమ్స్ ఆస్పత్రి, ఎంవీపీ రైతుబజార్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ టీబీ ఆస్పత్రి, టర్నర్‌చౌల్ట్రీ, హోల్‌సేల్ ఫ్రూట్‌మార్కెట్, మద్రిపాలెం, శ్రీహరిపురం, ములగాడ, నమ్మిదొడ్డి, చినగంట్యాడ, చిట్టివలస, బాజీజంక్షన్, పెందుర్తి, వేపగుంట, గోపాలపట్నం రైతుబజార్, కేజీహెచ్, ఆరిలోవ, మారికవలస, వాంబేకాలనీ, వైఎస్ఆర్ కాలనీ, ఆటోనగర్, భీమిలి, ఎన్టీఆర్ ఆస్పత్రి, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. వీటిలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను రూ.5 చొప్పున అందజేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో అన్న క్యాంటీన్‌లో ప్రతిరోజూ సగటున 950 మంది ఆహారం తీసుకుంటున్నారు. రుచి, శుచి, నాణ్యతతో ఉన్న ఆహారపదార్థాలను రోజువారీ కూలీలు, ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారులు తృప్తిగా ఆరగిస్తున్నారు. దీంతో క్యాంటీన్లకు ఆదరణ పెరుగుతోంది. కంచరపాలెంలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయపాత్ర సెంట్రల్ కిచెన్‌లో వంటకాలను సిద్ధం చేసి, వాహనాల్లో అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్నారు.

ఉదయం అల్పాహారం కింద ప్రతిరోజూ మూడు ఇడ్లీ, 150 మిల్లీలీటర్ల సాంబార్, 150 గ్రాముల చట్నీ ఇస్తున్నారు. ఒక్కో ఇడ్లీ 45 గ్రాములుంటుంది. సోమవారం, గురువారాల్లో మూడు పూరీ, 100 గ్రాముల కూర అందిస్తారు. మంగళ, శుక్రవారాల్లో 250 గ్రాముల ఉప్మా, మిక్చర్, సాంబరు ఉంటాయి. బుధ, శనివారాల్లో పొంగల్, సాంబార్, మిక్చర్ ఉంచుతున్నారు. మధ్యాహ్నం, రాత్రి భోజనం కింద సోమవారం నుంచి శనివారం వరకూ 400 గ్రాముల అన్నం, 120 గ్రాముల పప్పు లేదా సాంబార్, 100గ్రాముల కూర, 75 గ్రాముల పెరుగు, 15 గ్రాముల పచ్చడి అందజేస్తున్నారు. అన్న క్యాంటీన్ల వద్ద ఉదయం ఏడున్నర నుంచి పది గంటల వరకూ అల్పాహారం, మధ్యాహ్నం 12.30 నుంచి మూడు గంటల వరకూ భోజనం, రాత్రి ఏడున్నర గంటల నుంచి తొమ్మిది గంటల డిన్నర్ అందిస్తారు.

ఆదరణ బాగుంది

నగరంలో అన్న క్యాంటీన్లకు ఆదరణ బాగుంది. రోజురోజుకీ తాకిడి పెరుగుతోంది. ఎంవీపీ రైతుబజార్, కేజీహెచ్, వీజీహెచ్, మద్రిపాలెంలోని క్యాంటీన్‌లకు అధికంగా జనం వస్తుండగా, నమ్మిదొడ్డి, భీమిలిలోని క్యాంటీన్‌లకు తాకిడి కొంత తక్కువగా ఉంది. తాకిడికి అనుగుణంగా ఆహార సరఫరాను సర్దుబాటు చేస్తున్నాం.

తహసీల్దార్ల బదిలీల్లో సిఫారసులకే పెద్దపీట!

... 5వ పేజీ తరువాయి

బదిలీ చేస్తూ ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు. డిప్యూటీ తహసీల్దార్లను కూడా నగరం, దానికి ఆనుకుని మండలాల్లో అటుఇటుగా సర్దేశారు తప్ప ఏజెన్సీకి బదిలీ చేయలేదు. విశాఖ ఆర్డీవో కార్యాలయంలో డీటీగా పనిచేసే సూర్యకళ (53 సంవత్సరాలు)ను ఏజెన్సీకి బదిలీ చేయడంపై రెవెన్యూ వర్గాల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతుంది. యువకులకు కాదని 50 ఏళ్లు దాటిన ఒంటరి మహిళను ఏజెన్సీకి పంపడం సమంజసం కాదనే వాదన వినిపిస్తోంది.

అస్త్రశస్త్రాలతో ఇరుపక్షాలు రెడీ

... 5వ పేజీ తరువాయి

వివరాలను సంబంధిత విభాగాల అధికారులను కోరాలని కూటమి నేతలు, కార్పొరేటర్లు నిర్ణయించినట్టు సమాచారం. మరోవైపు కౌన్సిల్‌లో బలం కోల్పోయిన వైసీపీ కూడా కూటమి దాడిని తిప్పికొట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేసుకుంటోంది. అందులో భాగంగానే మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన సోమవారం వైసీపీ కార్పొరేటర్ల షాడో సమావేశం జరిగింది. అందరూ ఉమ్మడిగా కూటమి కార్పొరేటర్ల ఎదురుదాడిని, ఆరోపణలను తిప్పికొట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగరంలో జరిగిన కొన్ని అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగిందనే ఆరోపణలతో వారిని డిఫెన్స్‌లో పడేయాలని వైసీపీ కార్పొరేటర్లు భావిస్తున్నట్టు సమాచారం.

ఈపీడీసీఎల్‌లో కొనసాగుతున్న కసరత్తు

... 5వ పేజీ తరువాయి

ఇంజనీర్ పోస్టులు ఉండగా 72 మంది మాత్రమే కనిపిస్తున్నారని, మిగిలిన నలుగురు ఎక్కడ ఉన్నారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఈ కారణంగానే బదిలీల ఉత్తర్వులు సోమవారం రాత్రి తొమ్మిది గంటల వరకు బయటకు రాలేదు. దిగువ స్థాయి సిబ్బంది బదిలీలకు సంబంధించి మాత్రం నాలుగు ఉత్తర్వులు జారీచేశారు. ఎస్ఈలు, డీఈలు, ఏఈల బదిలీల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. మరోవైపు రాజకీయ సిఫారసులను కూడా పరిగణనలోకి తీసుకొని బదిలీలు చేయాల్సి ఉండడంతో అధికారులు బాగా ఇబ్బంది పడుతున్నారు.

హార్టీకల్చర్‌లో అంతా మాయే

... 5వ పేజీ తరువాయి

చూస్తుంది. ఆయా పనులను అధికారులు ఏటా టెండర్లు ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తుంటారు. నగరవ్యాప్తంగా 60 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిస్తే స్టీల్ ప్లాంటులో ఉద్యోగం చేస్తున్న ఇద్దరు వ్యక్తులు తమ కుటుంబ సభ్యుల పేర్లతో 40 శాతానికిపైగా లెస్‌కు వేసి పనులు దక్కించుకుంటున్నారు. టెండరు దక్కిన తర్వాత పనులు చేయకుండానే అధికారుల అండదండలతో బిల్లులు చేసుకుంటున్నారు. టెండరు గడువు ముగిసిన తర్వాత తిరిగి టెండర్లు పిలవాల్సి ఉన్నా, పాతవారికే నామినేషన్ పద్ధతిపై పనులు అప్పగించడంపై ఆరోపణలు రావడంతో మేల్కొన్న అధికారులు తమ తప్పులేదని తప్పించుకునేందుకు వీలుగా కొత్తవ్యూహానికి తెరదీశారు. రూ.1.91 కోట్లు విలువైన 15 పనులకు శనివారం గుట్టుగా షార్ట్‌టెండర్ పిలిచారు. టెండర్‌లో పాల్గొనేందుకు కాంట్రాక్టర్లకు కేవలం మూడు రోజులు మాత్రమే అవకాశం కల్పించారు. సాధారణంగా టెండరు పిలిచినా ఇబ్బంది లేనప్పటికీ ఎందుకు షార్ట్‌టెండర్ పిలవాల్సి వచ్చిందనే దానిపై అధికారులు నోరువిప్పకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. సాధారణంగా టెండరు నోటిఫికేషన్ జారీచేస్తే కనీసం 20 రోజులు బిడ్ దాఖలకు అవకాశం ఉంటుంది. అలా అయితే ఎక్కువ మంది కాంట్రాక్టర్లు బిడ్ వేస్తారు కాబట్టి, తమ అస్మదీయులు మాత్రమే టెండర్‌లో పాల్గొనేలా చేసి వారికే పనులు దక్కేలా చేసేందుకే అధికారులు షార్ట్‌టెండర్ వ్యూహాన్ని అమలుచేసి ఉంటారని అంటున్నారు. హార్టికల్చర్ విభాగంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కమిషనర్ సంపత్‌కుమార్ దృష్టిసారించకపోతే నగర సుందరీకరణ అటకెక్కడంతోపాటు జీవీఎంసీ నిధులు కాంట్రాక్టర్లు, అధికారుల జేబుల్లోకి వెళ్లిపోవడం ఖాయమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

జడ్పీలో బదిలీలు

... 5వ పేజీ తరువాయి

బదిలీ కాగా అక్కడ కార్యాలయ సూపరింటెండెంట్ డి.సీతారామరాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నర్సీపట్నం ఎంపీడీవో ఎం.జయమాధవిని రాంబిల్లి, అక్కడ ఉన్న కేఎస్ కొండలరావును ఎలమంచిలి బదిలీ చేశారు. ఎలమంచిలి ఎంపీడీవో కె.అప్పలనాయుడు వేరే జిల్లాకు బదిలీపై వెళ్లారు. రోలుగుంట ఎంపీడీవో కె.ప్రభాకరరావును అచ్యుతాపురం బదిలీ చేసి...ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన వీఎస్ నాగేశ్వరరావుకు నియమించారు. కొత్తగా వచ్చిన వి.అప్పారావుకు వి.మాడుగుల ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. చింతపల్లి ఎంపీడీవో పి.ఆశాజ్యోతిని పాడేరు బదిలీ చేసి, ఆమె స్థానంలో కొత్తగా వచ్చిన ప్రేమ్‌సాగర్‌ను నియమించారు. పాడేరులో పనిచేస్తున్న కె.సాయినవీన్‌ను పొరుగు జిల్లాకు కేటాయించారు. జి.మాడుగుల ఎంపీడీవో లోహిత్‌సాగర్ మరో జిల్లాకు వెళ్లగా అతని స్థానంలో కొత్తగా వచ్చిన తేజ్‌రతన్‌ను నియమించారు. అలాగే హుకుంపేట ఎంపీడీవో ఆర్.వెంకటరావు పొరుగు జిల్లాకు వెళ్లగా అతని స్థానంలో కొత్తగా వచ్చిన టి.రమాదేవికి పోస్టింగ్ ఇచ్చారు. ముంచంగిపుట్టు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ ఇతర జిల్లాకు వెళ్లగా ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన ఎం.శ్రీసాయిహర్షను, పెదబయలు ఎంపీడీవో విగిన్ బక్కా ఇతర జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన కేవీ ప్రసాద్‌ను నియమించారు. కాగా పద్మనాభం (విజయకుమార్), అనకాపల్లి (కేవీ నరసింహరావు), కశింకోట (వీవీ రవికుమార్), కోటవురట్ల (జి.కాశీవిశ్వనాథరావు), రావికమతం (వెంకన్నబాబు), డుంబ్రిగుడ (ఎం.ఉషారాణి), గూడెంకొత్తవీధి (వై.ఉమామహేశ్వరరావు) ఎంపీడీవోలను అక్కడే కొనసాగించారు. అనంతగిరి ఎంపీడీవో స్టడీ లీవ్‌లో ఉండగా అక్కడ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మాకవరపాలెం, పెందుర్తిలో ఎవరినీ నియమించలేదు.



లడ్డూ దక్కించుకున్న రామారావు, రాము

రూ.1.4 లక్షలకు లడ్డూ వేలం

మధురవాడ, సెప్టెంబరు 23 : జీవీఎంసీ ఏడో వార్డు చంద్రంపాలెంలో ఏర్పాటు చేసిన 33 అడుగుల వినాయక ప్రతిమ వద్ద ఉంచిన 110 కిలోల లడ్డూకు ఆదివారం రాత్రి వేలం పాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన పిళ్లా రాము, స్వతంత్రనగర్ కాలనీకి చెందిన కర్రి రామారావు రూ. 1.40 లక్షలకు వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. నిర్వాహకులు వారిని సత్కరించి, లడ్డూ ప్రసాదం అందజేశారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, సెప్టెంబరు 23 : వరాహలక్ష్మీనృసింహ స్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచరాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్రనామావళిని పఠిస్తూ తులసీ దళార్చన జరిపారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ప్రజా ఫిర్యాదుల విభాగానికి ఐదు వినతులు

భీమునిపట్నం, సెప్టెంబరు 23 : జీవీఎంసీ జోన్ వన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అయిదు వినతులు అందాయి. పట్టణంలోని జోనల్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కార్యాలయం సూపరింటెండెంట్ సారిపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంజనీరింగ్ విభాగానికి 3, యూసీడీ, ప్రజారోగ్యం విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు అందాయి.

ఏసీపీని కలిసిన టీడీపీ నాయకులు

ఎండాడ, సెప్టెంబరు 23 : నార్త్ జోన్ ఏసీపీ ఎస్. అప్పలరాజును 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో నాయకులు మధురవాడ పీఎస్‌లో సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన్ను కలిసిన వారిలో తెలుగు యువత అధ్యక్షుడు ఒమ్మి బాబూరావు, తదితరులు ఉన్నారు.

పీపీ బదిలీల్లో అక్రమాలు

మద్దిలపాలెం, సెప్టెంబరు 23 : బదిలీల్లో ఎస్సీ ఎస్టీ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు అన్యాయం జరిగిందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉత్తరాంధ్ర అధ్యక్షుడు కొంగరాపు గణపతి అన్నారు. పీతాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 98 మంది న్యాయాధికారులను బదిలీ చేయగా ఉత్తరాంధ్రలో 13 మంది ఏపీపీలు బదిలీ అయ్యారన్నారు. దళిత ఏపీపీలు కోరుకున్న చోట పోస్టింగ్ ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. పాడేరు ఏజెన్సీలో నాలుగేళ్ల నుంచి పనిచేస్తున్న ఏపీపీని బదిలీ చేయకుండా యథాస్థానంలో కొనసాగించడం దారుణమన్నారు. బదిలీలపై ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 52, టమాటా 44, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 32, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 44, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 24, క్యారెట్ 38, దొండకాయలు 32, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 80, బరబటి 50, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 72, పొటల్స్ 44, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామ కాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ I లో..



మధురవాడలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



వైద్యులతో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకట కుమారి

అందరి సహకారంతోనే ఆరోగ్య ఏపీ

» భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
» పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

మధురవాడ, సెప్టెంబరు 23 : అందరి సహకారంతోనే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధ్యమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన మధురవాడ పీహెచ్‌సీలో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు పారిశుధ్య సిబ్బంది చేసిన సేవలు అభినందనీయమన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం నిత్యం శ్రమిస్తున్న పారిశుధ్య సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యులు పారిశుధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం : మేయర్

వెంకోజీపాలెం : నగరాన్ని అనునిత్యం పరిశుభ్రంగా ఉంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ, సంక్షేమమే ధ్యేయంగా సఫాయి మిత్ర సురక్షా శిబిరాలు నిర్వహిస్తున్నామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. సోమవారం జోన్-3 ఇసుకతోట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా సఫాయిమిత్ర సురక్షా శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ఈనెల17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని, అందులో భాగంగా పారిశుధ్య కార్మికులకు, సఫారీ కర్మచారీలకు వైద్య పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. కార్మికులంతా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. నగరంలోని అన్ని జోన్లలోనూ సఫాయిమిత్ర సురక్ష శిబిరాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, జీవీ ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పుడా కాలనీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా



చినవాల్తేరులో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, అమరేంద్ర

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంటా, వెలగపూడి

మధురవాడ, సెప్టెంబరు 23 : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 7వ వార్డులోని మిథిలాపురి వుడాకాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ నిరంకుశ పాలనతో ప్రజలు విసిగిపోయి కూటమికి అధికారం అందించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ఇది మంచి ప్రభుత్వంగా పేరు తెచ్చుకుంటుందని తెలిపారు. 2047లో రాష్ట్రం దేశంలోనే అభివృద్ధిలో నంబర్ వన్ స్థానంలో ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ రాజబాబు, పిళ్లా వెంకటరావు, జడ్డీ సింహాచలం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర ప్రజలకు సుస్థిర పాలన అందుతుందని 16వ వార్డు టీడీపీ నాయకులు నారు గోపి, ముగడ వాసు అన్నారు. సోమవారం వారు ఆ వార్డులోని ఇసుకతోట, రెల్లివీధి ప్రాంతాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లా ఉమా రాణి, మొల్లి శంకర్, జి. అప్పన్న, మొల్లి శోభ, పల్లా బాబు పాల్గొన్నారు. 15వ వార్డులోని పలు ప్రాంతాల్లోనూ కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, పచ్చితాల సాయి బాబా, కనకాల పాపారావు పాల్గొన్నారు.

కొమ్మాది : రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఆరోవార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. కూటమి నాయకులు పీఎంపాలెం ప్రధాన రహదారిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వదేవుళ్ల, షేక్ సుభాని, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : కూటమి ప్రజలు మెచ్చిన మంచి ప్రభుత్వమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఆయన 3వ వార్డులో పర్యటించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు ఎం. రమణ, ఉమ్మిడి రాజు, కారి మసేను, తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు : కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తుందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. 21వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పీతల అమరేంద్ర, అవినాష్ ఆధ్వర్యంలో చినవాల్తేరు పరిసరాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూర్తి యాదవ్, పీతల అవినాష్, నక్క వినయ్, చిన్ని, రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు గోశాలలోని సింహగిరి నిర్వాశిత గిరిజన కాలనీలో కార్పొరేటర్ పిసిని వరాహ నరసింహం ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ ఉపాధ్యక్షుడు పట్నాల ధర్మరాజు, కాలనీ అధ్యక్షుడు గెడ్డపు సన్యాసిరావు, కాశి, లండ బాపూజీ, తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువతికి గాయాలు

సింహాచలం, సెప్టెంబరు 23 : జీవీఎంసీ 98వ వార్డు పాతగోశాల నుంచి పాత అడివివరం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆర్‌టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొనడంతో యువతికి గాయాలయ్యాయి. సింహాచలం వైపు నుంచి గోశాల కూడలి వైపు స్కూటీపై వెళుతున్న యువతిని గోపాలపట్నం వైపు నుంచి సింహగిరికి వెళుతున్న సిటీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో యువతికి తీవ్ర గాయాలయ్యాయి.

శ్రీప్రకాష్ విద్యార్థినికి యూఎస్‌డీ బహుమతి



లక్ష్మీ సహస్రను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

సిరిపురం, సెప్టెంబరు 23 : నగరానికి చెందిన యంగ్ ఆర్టిస్ట్ 17వ గ్లోబల్ టయోటా డ్రీమ్‌కార్ ఆర్ట్ కాంటె టయోటా కాంటెస్ట్‌లో శ్రీప్రకాష్ విద్యార్థిని పేరూరి లక్ష్మీ సహస్ర విజేతగా నిలిచింది. టయోటాస్ మెమరీ కార్ పేరుతో రూపొందించిన ఆమె చిత్రానికి 90 దేశాలు, 712,845 ప్రాంతాల్లో విశేషమైన ఆదరణ లభించింది. పూల్ నుంచి టాప్ 26 ప్రపంచ ఫైనలిస్ట్‌లో ఆమె స్థానం సంపాదించుకుంది. 12 నుంచి 15 ఏళ్ల విభాగంలో ఆమె ఈ ఘనత సాధించడంతో యూఎస్‌డీ బహుమతి లభించిందని టీకేఎం ప్రాంతీయ ప్రతినిధి శబరి మనోహర్ తెలిపారు.

శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు కరువు



తగరపువలస శ్మశానవాటికలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్

తగరపువలస, సెప్టెంబరు 23 : తగరపువలస, చిట్టివలస శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో దహన సంస్కారాలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మృతదేహాల దహనానికి ఇక్కడ ఒక షెడ్ మాత్రమే నిర్మించారు. ఇతర కార్యక్రమాలకు ఎటువంటి సదుపాయాలు లేవు. తగరపువలస శ్మశానవాటికలో ఉన్న బోరు బావి పాడైంది. శ్మశానవాటికకు గోస్తనీ నది నీరు దూరంలో ఉండడంతో మృతదేహాల దహన సంస్కారాల అనంతర కార్యక్రమాలకు సమస్యలు నెలకొంటున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి శ్మశానవాటికల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్ప స్తంభం వద్ద సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్

సింహాచలం, సెప్టెంబరు 23 : వరాహలక్ష్మీనృసింహస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఈస్ట్ కోస్టు రైల్వే ప్రధాన పరిపాలనాధికారి శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రాజీవ్‌కుమార్, సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ ఉన్నారు. వారికి ఆలయ అధికారులు అధికారిక లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. అనంతరం వారు గోదాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన సింహాచలం ఈఓ



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఈఓ త్రినాథరావు

సింహాచలం, సెప్టెంబరు 23 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామివారి శేషమాలికను కలెక్టర్‌కు వేసి శాలువతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

'అప్పన్న ఆలయాన్ని తక్షణమే సంప్రోక్షణ చేయండి'

సింహాచలం, సెప్టెంబరు 23 : నాణ్యత లేని ముడి సరకులు వాడి స్వామివారి ప్రసాదాల తయారీలో అపవిత్రతకు పాల్పడడంతో తక్షణమే ఆలయంలో సంప్రోక్షణ జరపాలని విశ్వహిందూ పరిషత్ మందిర అర్చక పురోహిత టోలీ సురక్షా ప్రముఖ్ పూడిపెద్ది శర్మ కోరారు. ఈమేరకు సోమవారం ఆయన దేవస్థానం ఈఓకు వినతిపత్రం అందించారు. ఆలయ వ్యవస్థను వ్యాపార సంస్థగా కాకుండా ఆధ్యాత్మిక సంస్థగా చూడాలని చెప్పారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

పద్మనాభం, సెప్టెంబరు 23 : మండలంలో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఏఓ ఎంవీఎస్ చలం చెప్పారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి రోజు మద్ది, అనంతవరం, 25న రెడ్డిపల్లి, పొట్నూరు గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 8.30 నుంచి 12 వరకు ఒక గ్రామంలో, మధ్యాహ్నం 2 నుంచి 5.30 వరకు మరో గ్రామంలో నిర్వహిస్తామని తెలిపారు.

'హార్టికల్చర్ విభాగం పనితీరుపై విచారణ జరపాలి'

సిరిపురం, సెప్టెంబరు 23 : జీవీఎంసీ హార్టికల్చర్ విభాగం పనితీరుపై విచారణ చేపట్టాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ పర్మినెంట్ ఉద్యోగులు వారి భార్యల పేరుతో కాంట్రాక్టులు దక్కించుకుంటున్నారని ఆరోపించారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకుండానే బిల్లులు సొంతం చేసుకుంటున్నారని, విచారణ జరిపే వరకు టెండర్ ప్రక్రియ నిలిపివేయాలన్నారు.

తగరపువలసలో రోడ్లపై మురుగు నీరు



ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

తగరపువలస, సెప్టెంబరు 23 : తగరపువలసలో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో వర్షం పడిన ప్రతిసారి కాలువల్లో మురుగు రోడ్లపైకి వస్తోంది. దుకాణదారులు కాలువలపై పలకలు వేసి మెట్లు నిర్మించడంతో పూడిక తీయడానికి వీలుకావడం లేదు. దీంతో వర్షం పడితే కాలువలు పొంగి మురుగు నీరు రహదారులపై చేరి, పరిసరాలు దుర్గంధంగా తయారవుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలువల్లోని వ్యర్థాలు ప్రధాన రహదారిపై చేరడంతో వాహనదారులు, పాదచారులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తగరపువలస, చిట్టివలస పంచాయతీలుగా ఉన్నప్పుడు నిర్మించిన కాలువలే ఇప్పటికీ ఉండడంతో వాటిని లోతు చేయాల్సి ఉంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పదో వార్డులో సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ, సెప్టెంబరు 23 : జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి సంతపాలెంలో అదనపు సామాజిక భవనం నిర్మాణానికి ఎంపీ ఎం.శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చినగదిలి నాయకులు పేదలు శుభ కార్యాలు చేసుకునేందుకు సరైన వసతి లేక ఇబ్బంది పడుతున్నారని తనదృష్టికి తీసుకురావడంతో జీవీఎంసీ నిధులు రూ. 36 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, విశాఖ పార్లమెంట్ కార్యదర్శి ఒమ్మి పోలారావు, కార్యదర్శి బుడుమూరు గోవింద్, గోపీ, ఏఈ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు. కాగా పదో వార్డులో నిర్మించిన సామాజిక భవనాన్ని ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో ఏ సమస్యలున్నా.. తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, నాయకులు ఒమ్మి సన్యాసిరావు, రాగోతి అచ్చుతరావు. ఒమ్మి అప్పలరాజు, గాడు అప్పలనాయుడు, ముగడ రాజారావు, జనసేన, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయ పూర్వ ఈఓకి ఆత్మీయ వీడ్కోలు



పూర్వ ఈఓ శ్రీనివాసమూర్తిని సత్కరిస్తున్న ఆలయ ఉద్యోగులు

సింహాచలం, సెప్టెంబరు 23 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈఓగా పని చేసిన బదిలీపై మాతృ శాఖకు వెళుతున్న సింగాల శ్రీనివాసమూర్తికి దేవస్థానం సిబ్బంది, అధికారులు సోమవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ప్రస్తుత ఈఓ వేండ్ర త్రినాథరావు, అధికారులు శాలువతో సత్కరించి, పూలమాలలు వేశారు. జ్ఞాపికలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

'పొలం పిలుస్తోంది' పోస్టర్ ఆవిష్కరణ

భీమునిపట్నం, సెప్టెంబరు 23 : రైతులకు ఎంతో ప్రయోజనకరమైన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని పండగలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భీమిలి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు బి. విజయప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి మంగళ, బుధవారం రోజుకు రెండు గ్రామాల చొప్పున కార్యక్రమం జరగనున్నట్టు చెప్పారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం, పంటల్లో తెగుళ్లు, నివారణ చర్యలు తదితర వాటిపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ శాఖ ఏడీ విజయప్రసాద్, డీపీడీ అల్లం మోహనరావు, మత్స్యశాఖ అధికారి లావణ్య, పట్టుపరిశ్రమ ఏడీ జీవన్, మార్క్‌ఫెడ్ డీఎం రమేష్, ఏవో శివకోమలి, వెటర్నరీ డీడీ చంద్రశేఖర్, బి. వెంకటరమణ, టీడీపీ నియోజకర్గ నాయకులు కోరాడ రాజబాబు, దంతులూరి అప్పల నరసింహరాజు, సరగడ అప్పారావు, సంకురుభుక్త ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆనందపురం, సెప్టెంబరు 23 : మండలంలోని ఏక ఉపాధ్యాయ పాఠశాలల్లో పనిచేస్తున్న వారు అత్యవసర పరిస్థితుల్లో సెలవు పెట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే ఆ సమస్యను పరిష్కరించాలని యూటీఎఫ్ మండల శాఖ నాయకులు కోరారు. సోమవారం వారు ఈవిషయమై ఎంఈఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య తగ్గట్టుగా టీచర్లు ఉన్న చోట నుంచి ఇతర పాఠశాలలకు డిప్యూటేషన్‌పై వేయడం వల్ల వాటిలో కూడా విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు.అటువంటి పాఠశాలల నుంచి డిప్యూటేషన్లు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్, జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము, మండల కార్యవర్గ సభ్యుడు సీహెచ్ అవతారం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



ప్రతిభ పురస్కారాలు పొందిన విద్యార్థులతో కంచెర్ల

ఆరిలోవ, సెప్టెంబరు 23 : పేద విద్యార్థులను ఆదుకోవడానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఉపకార్ ట్రస్టు అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కంచెర్ల అచ్చుతరావు అన్నారు.సోమవారం ఆయన చినగదిలిలోని రాధాకృష్ణ నగర్‌లో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో స్వచ్ఛతా హీ సేవా

మద్దిలపాలెం, సెప్టెంబరు 23 : జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, టీడీపీ వార్డు అధ్యక్షుడు గొలగాని పురుషోత్తం, జీవీఎంసీ అధికారులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. దుకాణాలకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు వినియోగించకూడదని వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

పద్మనాభం, సెప్టెంబరు 23 : పద్మనాభంలో విశాఖపట్నం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళ వారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు జరగనున్నట్టు ఎంఈఓలు పి. రమణ, ఎస్‌డీ బాబూలాల్ తెలిపారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 14, 17 ఏళ్లలోపు వారికి రెండు విభాగాలుగా జరుగుతాయన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, యోగా, బాల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడాంశాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల వారు మండల ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ ఎల్‌వీవీఆర్ సత్యం ఫోన్ నంబర్ 9704737384)ను సంప్రతించాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణ సామగ్రి లారీల అడ్డగింపు

పద్మనాభం, సెప్టెంబరు 23 : మండలంలోని తునివలస పంచాయతీ నర్సాపురంలో జగనన్న కాలనీకి ఇళ్ల నిర్మాణ సామగ్రి తీసుకువెళ్తున్న లారీలను స్థానికులు సోమవారం అడ్డుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ భారీ లారీలతో నిర్మాణ సామగ్రిని కల్వర్టు మీదుగా తీసుకువెళ్లడంతో పైపులైన్ పాడైంది.దీంతో గ్రామస్థులు పైపులైన్ బాగు చేయించాలని అప్పటివరకు లారీలను తిరగనివ్వమని అడ్డుకున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని దెబ్బతిన్న కల్వర్టును, పైపులైన్‌ను బాగు చేయించాలని కాంట్రాక్టర్ ఆదేశించారు. అందుకు ఆయన అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కోటి, పద్మనాభం పోలీసులు పాల్గొన్నారు.